

పరిశ్రమల ఏర్పాటు పక్కా..

జీడీ నెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ వీఎం థామస్



తెలుగు, తమిళ సంగమ ప్రాంతమైన గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో రాజకీయమంటే పూలదారి కాదు. నాయకులకన్నా క్రియాశీలకంగా ప్రజలు ఉండే నియోజకవర్గం ఇది. పొరుగునే ఉన్న తమిళనాడుతో పోల్చుకుని నిలదీస్తూ ఉంటారు. మాటలు చెప్పి మాయచేయడానికి కుదరదు. ఏ పార్టీ అయినా ఏకతాటిమీద నడవడం సాధ్యం కాదు. ఇటువంటి నియోజకవర్గంలో రాజకీయ తెరమీద హఠాత్తుగా ప్రత్యక్షమైన పేరు డాక్టర్ వీఎం థామస్. ఫెర్టిలిటీ వైద్య నిపుణుడిగా చెన్నైలో ఎంతో పేరు ప్రఖ్యాతులున్న ఈయనా.. రాజకీయాల్లో ఆరితేరిన నారాయణస్వామిని ఢీకొనేది అని తొలుత అందరూ పెదవి విరిచారు. రాజకీయ అనుభవం కన్నా ప్రజల ఆకాంక్ష బలమైనది. తొలి ప్రయత్నంలోనే డాక్టర్ వీఎం థామస్.. జీడీ నెల్లూరు ఎమ్మెల్యేగా గెలిచారు. స్థానిక పార్టీ నాయకులను సమన్వయం చేసుకోవడంలో కొంత తడబడినా ఆ తర్వాత రాజకీయంగా పట్టు సాధించడం మీద దృష్టి పెట్టారు. వెనుకబడిన నియోజకవర్గంగా మిగిలిపోయిన జీడీ నెల్లూరు అభివృద్ధికి చేయాల్సిన పనుల జాబితాతో చంద్రబాబును కలిశారు. అసెంబ్లీలో ప్రస్తావించారు. ఏడాది కాలంలో చేసినవాటికన్నా, మరి ఏడాది సాధించాల్సినవి చాలానే ఉన్నాయనే లక్ష్యంతో కదులుతున్నారు. జీడీ నెల్లూరు ఎమ్మెల్యేగా తొలి ఏడాది డాక్టర్ వీఎం థామస్ ప్రోగ్రెస్ రిపోర్ట్...

- 4వ పేజీలో

హౌసింగ్ పీడీ గోపాల్ నాయక్ సస్పెన్షన్



చిత్తూరు, జూలై 14 (ఆంధ్రజ్యోతి):జిల్లా ఇన్‌చార్జి హౌసింగ్ పీడీ భూక్యా గోపాల్ నాయక్‌ను ప్రభుత్వం సస్పెండ్ చేసింది.ఆయనతో పాటు అన్నమయ్య జిల్లా హౌసింగ్ పీడీ వి.సాంబశివయ్య కూడా సస్పెండయ్యారు. గోపాల్ నాయక్ గతంలో పీలేరులో హౌసింగ్ డీఈఈగా, రాయచోటి ఈఈగా పనిచేశారు. ఈ ఏడాది జనవరి నుంచీ చిత్తూరు జిల్లా హౌసింగ్ పీడీగా విధులు నిర్వర్తిస్తున్నారు.గోపాల్ నాయక్, సాంబ శివయ్య గతంలో అన్నమయ్య జిల్లా రాయచోటిలో పని చేస్తుండగా తమ సబార్డినేట్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగి అనగాని శ్రీహరిని బదిలీ చేయకుండా ఉంచేందుకు లంచం డిమాండ్ చేశారని వచ్చిన అవినీతి ఆరోపణలు రుజువు కావడంతో ఏసీబీ డైరెక్టర్ జనరల్ ఇచ్చిన నివేదిక ఆధారంగా వారిద్దరినీ సస్పెండ్ చేస్తూ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

అంతర్రాష్ట్ర రైలు దోపిడీ కేసుల్లో ఇద్దరి అరెస్టు



పట్టుబడ్డ ముఠా సభ్యుల గురించి వివరిస్తున్న రైల్వే ఎస్పీ రాహుల్ మీనా



ఎస్పీనుంచి ప్రశంసా పత్రం అందుకుంటున్న సీఐ సుధాకర రెడ్డి - హెడ్ కానిస్టేబుల్ నాగాంజనేయులు

చిత్తూరు అర్బన్, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : పలు అంతర్రాష్ట్ర రైలు దోపిడీలకు సంబంధించిన ముఠాలో ఇద్దరిని రైల్వే పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రెండు కత్తులను, రెండు కట్టర్లను స్వాధీనం చేసుకుని ముఠాలో మిగిలిన వారికోసం గాలిస్తున్నారు.వేగంగా వెళుతున్న రైలును ఆపి వాళ్లు ఏ విధంగా దోపిడీకి పాల్పడతారో తిరుపతి రైల్వే డీఎస్పీ హర్షితతో కలిసి రైల్వే ఎస్పీ రాహుల్ మీనా సోమవారం మీడియాకు వివరించారు.'ఇటీవల గుంతకల్లు రైల్వే డివిజన్ పరిధిలో రైలు దోపిడీ సంఘటనలు చోటు చేసుకున్నాయి. ఉదయాత్పూర్వం 2గంటల నుంచి 4 గంటల మధ్యలో నిర్మానుష్య ప్రాంతాల్లో రైలు ఆగిపోయేలా సిగ్నల్ బాక్సుల్లో వైర్లను ట్యాంపరింగ్ చేసి దోపిడీలకు ఈ ముఠా సభ్యులు పాల్పడుతున్నట్లు గుర్తించాం. స్లీపర్, జనరల్ కోచ్‌లలో కూర్చుని పథకం ప్రకారం కిటికీల పక్కన కూర్చున్న మహిళలను లక్ష్యంగా ఎంచుకుని బంగారు ఆభరణాలను దోచుకెళ్లేవారు.ప్రత్యేక బృందాలతో ఆపరేషన్‌ను ప్రారంభించాం.మహారాష్ట్రలోని సోలాపూర్, పూనే ప్రాంతాల్లో గాలింపు చర్యలు చేపట్టాం. మాకు అందిన సమాచారం మేరకు ఈ నెల 13న తిరుపతి జిల్లా రేణిగుంటలో పూనే జిల్లా ఖడ్కి గ్రామానికి చెందిన జలిందర్ మహిర్యా పవార్(50), కోహినూర్ నవనత్(24)లను అరెస్టు చేశాం. విచారణలో ఏపీలోని రేణిగుంట, తాడిపత్రి, మంత్రాలయం, మానవపాడు, ముంగిలిపట్టు, పూతలపట్టు,సిద్ధంపల్లె ప్రాంతాలతో పాటు తెలంగాణ రాష్ట్రంలో జరిగిన అనేక దోపిడీ కేసుల్లో వీరి పాత్ర ఉన్నట్టు ఒప్పుకున్నారు.ముఠాలో మిగిలిన సభ్యులనూ అరెస్టు చేసి వారి వద్ద వున్న 242 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకుంటాం' అని రైల్వే ఎస్పీ రాహుల్ మీనా వివరించారు. దోపిడీ ముఠా సభ్యులిద్దరిని పట్టుకోవడానికి కృషి చేసిన రేణిగుంట ఐఆర్పీలు యతీంద్ర, సుధాకర రెడ్డి, ఆర్పీఎస్‌ఐలు ప్రవీణ్‌కుమార్, ధర్మేంద్రరాజు, సిబ్బంది నాగాంజనేయులు, రేవంత్, నరేంద్ర, గణేష్, నాగరాజ, లోకేష్, వినోద్, మానెయ్య, ఏలుమలైలను రైల్వే ఎస్పీ రాహుల్ మీనా ప్రత్యేకంగా అభినందించారు.

'విండోల' పునర్విభజన?

కొత్త విండోల ఏర్పాటుపై సాధ్యాసాధ్యాల అంచనాకు రాష్ట్రస్థాయి కమిటీ - డీసీసీబీ సీఈవోకు కమిటీలో చోటు



చిత్తూరు, యాదమరి సింగిల్ విండోల ఛైర్మన్లు బీఎన్.రాజసింహులు(దొరబాబు), చిత్ర

చిత్తూరు కలెక్టరేట్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): మారుమూల పంచాయతీల్లో ఉంటున్న రైతాంగానికి సైతం సహకార సేవలు సమృద్ధిగా అందించాలన్న ధ్యేయంతో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు (సింగిల్ విండోలు) మరిన్ని ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ నేపథ్యంలో సింగిల్ విండోల పునర్విభజన, నూతన విండోల ఏర్పాట్ల సాధ్యాసాధ్యాల అంచనాకు రాష్ట్రస్థాయి కమిటీని ప్రభుత్వం ఐదుగురు సభ్యులతో ఏర్పాటు చేసింది. రాష్ట్రస్థాయి కమిటీకి ఛైర్‌పర్సన్‌గా కో-ఆపరేటివ్ సొసైటీస్ కమిషనర్, కన్వీనర్‌గా ఆప్కాబ్ మేనేజింగ్ డైరెక్టర్, సభ్యులుగా నాబార్డు చీఫ్ జనరల్ మేనేజర్, కృష్ణా, చిత్తూరు డీసీసీబీ సీఈవో శంకరబాబును నియమించింది. వ్యవసాయ, సహకారశాఖ ఆధ్వర్యంలో 'సహకార్ - సే - సమృద్ధి' మార్గదర్శకత్వంలో రైతులందరినీ సభ్యులుగా చేర్చడం, అవసరమైన చోట్ల నూతనంగా సింగిల్ విండోలు ఏర్పాటు చేయడం, మండలాల్లో ఒకటికి మించి సింగిల్ విండోలుంటే వాటిని పునర్విభజన చేయడం, సింగిల్ విండోలు లేని మండలాల్లో కొత్తగా ఏర్పాటు చేయడం, వీలైతే వాటి కార్యకలాపాలు అందరికీ అందుబాటులో ఉండేవిధంగా కార్యస్థానం మార్పుచేయడం వంటి అంశాల్లో సాధ్యాసాధ్యాలను రాష్ట్ర కమిటీ అంచనా వేయనుంది.

173 నుంచి 75కు కుదింపు

వైద్యనాథన్ కమిటీ సిఫార్సుల మేర 2004లో అప్పటి ఉమ్మడి చిత్తూరు జిల్లాలో కొనసాగుతున్న 173 సింగిల్ విండోలను 75 విండోలకు కుదించారు. రాజకీయ ప్రాబల్యం ఉన్న పుత్తూరు, తవణంపల్లె, పలమనేరు తదితర మండలాల్లో ఒకటికి మించి సింగిల్ విండోలను కొనసాగించారు. ఇది అన్యాయమంటూ కొన్ని సింగిల్‌విండోల అధ్యక్షులు హైకోర్టుకు వెళ్ళగా, ఇప్పటికీ ఆ కేసులు కొనసాగుతున్నాయి.

12 సింగిల్‌విండోలకు పర్సన్ ఇన్‌ఛార్జి కమిటీలు

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో సింగిల్ విండోలకు అఫిషియల్ పర్సన్ ఇన్‌చార్జి కమిటీల స్థానంలో ప్రభుత్వం నాన్ అఫిషియల్ పర్సన్ ఇన్‌చార్జి కమిటీలను నియమించింది.చిత్తూరు జిల్లావ్యాప్తంగా 37 సింగిల్ విండోలుండగా, గత మంగళవారం 16 విండోల త్రిసభ్య కమిటీల పేర్లను ప్రభుత్వం ప్రకటించింది. రెండో విడతలో 12 విండోల పేర్లు విడుదల చేసింది. మిగిలిన తొమ్మిది విండోల త్రిసభ్య కమిటీల వివరాలు మంగళవారం విడుదల కానున్నాయి. తిరుపతి జిల్లాలో 18 సింగిల్ విండోలకు నాన్ అఫిషియల్ పర్సన్ ఇంచార్జి కమిటీలను నియమించింది. వీటిలో రెండు సింగిల్ విండోల కమిటీల పదవీ కాలం ఈ ఏడాది అక్టోబరు నెలాఖరు దాకా వుండగా మిగిలిన 16 విండోల కమిటీల పదవీ ఆలం ఈనెలాఖరుకే ముగియనుండడం గమనార్హం. అలా ముగిసే రెండు కమిటీల్లో కాయంపేట సింగిల్‌విండోకు డీసీసీబీ ఛైర్మన్ అమాస రాజశేఖరరెడ్డి, ఐతేపల్లి సింగిల్‌విండోకు డీసీఎంఎస్ ఛైర్మన్ పల్లినేని సుబ్రమణ్యంనాయుడు ఛైర్మన్లుగా నియమితులయ్యారు.

సింగిల్ విండో	ఛైర్మన్	డైరెక్టర్లు
చిత్తూరు	బి.ఎన్. రాజసింహులు (దొరబాబు)	వి. వెంకటేశ్వర నాయుడు, డి. మోహన్
గుడిపాల	డి. ఢిల్లీప్రతాప నాయుడు	డి.ఆర్. హరిప్రసాద్, ఆర్టీ శెల్వనాధన్,
యాదమరి	వి. చిత్ర,	ఎస్. మహబూబ్ బాషా, డి. ప్రభాకర్
ఐరాల	పులిగుండ్ల శేషాద్రి నాయుడు	శ్రీనివాసులు, నాంపల్లి సుబ్రహ్మణ్యం
పూతలపట్టు	పి. జగన్నాధన్	ఎం. గుణశేఖర్ రెడ్డి, వై. వెంకటేశ్వర్లు నాయుడు
ఎర్రచెరువుపల్లి	ఇ. ఇంద్రసేన నాయుడు	పాటూరు సుబ్రహ్మణ్యం, ఎస్. కిషోర్
నగరి	కె. బాలాజి	వి. జవహర్‌లాల్, ఐ. వెంకటేశ్వర్లు
రామకుప్పం	మహమ్మద్ రఫీ	చెల్దిగానిపల్లి సురేష్, టి. అంజప్ప
కుప్పంచీ	కృష్ణమూర్తి	కృష్ణవేణి, ఎం. అన్నాదురై
గుడుపల్లి	ఎం. రమేష్	వెంకటేశ్, టి.కృష్ణప్ప
శాంతిపురం	గోపాల్	వి. హరికుమార్, ఇ.ఎస్. దామోదర
అరగొండ	ఎ. రంజిత్ రెడ్డి	ఎ. విజయకుమార్, ఎస్. వెంకటేశ్వర్లు

పీఏ శ్రీనివాసులు హత్యకు కారణాలేమిటి?

ఆరా తీస్తున్న చెన్నై పోలీసులు ● దర్యాప్తులో సహకరించేందుకు చెన్నైకి రేణిగుంట సీఐ



శ్రీనివాసులు మృతదేహం

తిరుపతి, జూలై 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సంచలనం సృష్టించిన శ్రీకాళహస్తి జనసేన మాజీ ఇన్‌చార్జి వినుత మాజీ పీఏ శ్రీనివాసులు హత్యకు కారణాలేమిటన్నది అంతుబట్టడం లేదు. పాతికేళ్ల యువకుడిని పలుమార్లు చిత్రహింసలకు గురి చేశారని, దెబ్బలకు తట్టుకోలేకే అతడు చనిపోయాడని చెన్నై పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైంది. హత్యకు గురైంది కూటమి ప్రభుత్వంలోని అధికార పార్టీకి చెందిన మహిళా నేత డ్రైవరు, వ్యక్తిగత సహాయకుడూ కావడంతో ఇది సంచలనంగా మారింది. అన్ని రాజకీయ పార్టీల వర్గాలతో పాటు సామాన్య జనం కూడా హత్య వెనుక వాస్తవాలు తెలుసుకోవాలని ఆసక్తితో ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నది చెన్నై పోలీసులు కావడంతో హత్యపై సస్పెన్స్ కొనసాగుతోంది

నిందితుల కస్టడీకి పిటిషన్

శ్రీకాళహస్తి మండలం బొక్కిసపాలెం గ్రామానికి చెందిన శ్రీనివాసులు మృతదేహం చెన్నైలో లభించడంతో అక్కడి సెవెన్ వెల్స్ ప్రాంత పోలీసులు కేసు నమోదు చేసిన సంగతి తెలిసిందే. అందులో భాగంగా ప్రాథమిక దర్యాప్తులో శ్రీనివాసులు మృతికి శ్రీకాళహస్తి జనసేన ఇన్‌ఛార్జి వినుత, ఆమె భర్త చంద్రబాబు, వారి ముగ్గురు అనుచరులు కారకులని గుర్తించారు. వారిని అదుపులోకి తీసుకుని చెన్నైకి తరలించి కోర్టులో హాజరుపరిచి రిమాండుకు పంపించారు. అరెస్టుకు, రిమాండుకు పంపడానికి నడుమ పెద్దగా వ్యవధి లభించకపోవడంతో వారు నిందితులను లోతుగా విచారించలేదని తెలిసింది. అందుబాటులో ఉన్న సీసీ కెమెరాల పుటేజీల ఆధారంగా నిందితులను గుర్తించి కోర్టులో హాజరుపరిచారు. ఇపుడు నిందితులను కస్టడీకి తీసుకుని విచారిస్తే హత్యకు దారి తీసిన కారణాలేమిటన్నది తెలుస్తాయని చెన్నై పోలీసులు భావిస్తున్నారు. ఆ దిశగా వారు అక్కడి కోర్టులో కస్టడీ పిటిషన్ దాఖలు చేయడానికి సన్నద్ధమవుతున్నారు. ఈ లోపు చెన్నై పోలీసు కమిషనరేట్ నుంచీ వచ్చిన అభ్యర్థనతో కేసు దర్యాప్తులో సహకరించేందుకు రేణిగుంట సీఐని చెన్నై వెళ్లాల్సిందిగా జిల్లా ఎస్పీ హర్షవర్ధనరాజు ఆదేశించారు. దీంతో రేణిగుంట, శ్రీకాళహస్తి ప్రాంతాలకు సంబంధించిన సమాచారం ఇవ్వడంతో పాటు కేసు దర్యాప్తులో చెన్నై పోలీసులకు సహకరించడానికి రేణిగుంట సీఐ హుటాహుటిన చెన్నై బయల్దేరి వెళ్లారు.

హత్యకు ఇవేనా.. కారణాలు?

చెన్నై పోలీసులు నిందితులను ప్రాథమికంగా విచారించిన సందర్భంలో రెండు కారణాలు హత్యకు దారి తీసివుండవచ్చని భావించినట్టు తెలిసింది. వీటిలో ఒకటి వివాహేతర సంబంధం కాగా మరోటి వ్యక్తిగత సమాచారం ఇతరులకు చేరవేయడం అని చెన్నై పోలీసులు భావిస్తున్నారు. శ్రీనివాసులు తొలుత వినుతకు కారు డ్రైవరుగా నియమితులయ్యారని, తర్వాత క్రమంగా వ్యక్తిగత సహాయకుడిగా కూడా మారాడని తెలిసింది. ఆ కుటుంబానికి బాగా సన్నిహితంగా మారాడు. శ్రీకాళహస్తి, చెన్నై తదితర ప్రాంతాల్లో కొనసాగించిన వ్యక్తిగత వ్యవహారాలు, సెటిల్‌మెంట్లు వంటి వివరాలు శ్రీనివాసులు వద్ద వున్నట్టు చెన్నై పోలీసులు భావిస్తున్నారు. వాటిని చూపి బ్లాక్‌మెయిల్ చేయడం, వినుత ప్రత్యర్థులకు వాటిని అందించడం వంటివేవో జరిగాయని అనుమానిస్తున్నారు. వినుత దంపతులు శ్రీనివాసులును పీఏగా తొలగిస్తున్నట్టు విడుదల చేసిన ప్రకటనలో కూడా 'అతడు తమ ప్రాణ, గౌరవాలకు భంగం కలిగించాడు' అని స్పష్టంగా పేర్కొనడం గమనార్హం. ఈ దిశగానే విచారిస్తున్నారు.

దూకుడు రాజకీయాలతో ఒంటరైన వినుత

కాగా, రాజకీయంగా బలం లేకపోయినా వినుత వర్గం దూకుడుగా వ్యవహరిస్తూ ప్రతిపక్ష నేతలతో పాటు కూటమి పార్టీల నేతలతో కూడా వ్యక్తిగత వైరాన్ని కొనితెచ్చుకున్నట్టు నియోజకవర్గంలో ప్రచారమవుతోంది. చివరికి సొంత పార్టీలో కూడా అందరూ దూరమయ్యారని, ఇరుగుపొరుగు నియోజకవర్గాల నేతలు, జిల్లా నేతలతోనూ సత్సంబంధాలు లేవని జనసేన వర్గాలే చెబుతున్నాయి. ఒకరకంగా నియోజకవర్గంలోనూ, జిల్లాలోనూ రాజకీయంగా వినుత ఒంటరిగా మారినట్టయిందని సమాచారం. ఆ క్రమంలో వినుత పీఏగా ఉండిన శ్రీనివాసులు ఇతర పార్టీలకు చెందిన ఒకరిద్దరు నేతలకు టచ్‌లోకి వెళ్లారని, వినుత వర్గానికి చెందిన అభ్యంతరకర అంశాలు, ఫొటోలు, వీడియోలు, సమాచారం వారికి అందజేశాడనే ఆరోపణలున్నాయి. రాజకీయ ప్రత్యర్థులు వాటిని ఎప్పటికప్పుడు జనసేన అధిష్ఠానానికి చేరవేశారని సమాచారం. వినుతను జనసేన నుంచీ బహిష్కరిస్తున్నట్టు ఆ పార్టీ అధిష్ఠానం జారీ చేసిన ప్రకటనలో సైతం గత కొంతకాలంగా పార్టీ నిబంధనలకు విరుద్ధంగా వినుత వ్యవహార శైలి వుందని పేర్కొన్న సంగతి ఈ సందర్భంగా గమనించాల్సి వుంది. మొత్తానికీ శ్రీనివాసులు హత్య కేసుతో వినుత రాజకీయ భవిష్యత్తు దెబ్బతిన్నట్టయింది.

రైలునుంచి గర్భిణీని తోసేసిన కేసులో దోషికి జీవిత ఖైదు

బాధితురాలికి రూ.కోటి పరిహారం

చెన్నై, జూలై 14 (ఆంధ్రజ్యోతి): రైలు నుంచి గర్భిణీని తోసివేసిన ఘటనలో నిందితుడికి జీవిత ఖైదు విధించిన న్యాయస్థానం, బాధిత మహిళ (37)కు రూ. కోటి పరిహారం అందించాలని ఉత్తర్వులు జారీచేసింది. తమిళనాడు రాష్ట్రం తిరుప్పూర్‌లో భర్తతో కలిసి వుంటున్న ఆ గర్భిణి.. పుట్టిల్లైన చిత్తూరు సమీపంలోని మంగసముద్రానికి ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌లో బయల్దేరగా, వేలూరు జిల్లా గుడియాత్తం-కేవీ కుప్పం రైల్వే స్టేషన్ల మధ్య ఓ కామాంధుడు ఆమెపై అత్యాచారయత్నం చేసిన విషయం తెలిసిందే. అయితే ఆ మహిళ తనను ప్రతిఘటించిందన్న కోపంతో ఆ వ్యక్తి రైలునుంచి కిందకు తోసివేశాడు.ఈ ఘటనలో ఆమె తీవ్రంగా గాయపడడంతో పాటు ఆమెకు అబార్షన్ కూడా అయింది. ఈ ఘటనపై విచారణ చేపట్టిన పోలీసులు.. మహిళను రైలు నుంచి తోసివేసిన వేలూరు జిల్లా పూంజాలై గ్రామానికి చెందిన హేమరాజ్ (30)ను అరెస్ట్ చేశారు. హేమరాజ్‌పై 8 సెక్షన్ల కింద కేసు నమోదు చేయగా, తిరుపత్తూర్ జిల్లా కోర్టులో విచారణ జరిగింది. ఈ నేపథ్యంలో సోమవారం హేమరాజ్‌ను దోషిగా తేల్చిన జిల్లా కోర్టు న్యాయాధికారిణి మీనాకుమారి..అతనికి 15 సంవత్సరాల కఠిన కారాగారశిక్ష, జీవితఖైదు విధిస్తున్నట్లు ప్రకటించారు. అదే విధంగా బాధిత మహిళకు రైల్వేశాఖ రూ.50 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.50 లక్షల చొప్పున రూ. కోటి పరిహారంగా అందించాలని ఆదేశించారు.



బైరెడ్డి శబరి

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల, జూలై14 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని సోమవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. ఎంపీ బైరెడ్డి శబరి, మాజీ మంత్రి అవంతి శ్రీనివాస్, కర్ణాటక మంత్రి లక్ష్మీ హెబ్బాల్కర్ ఉన్నారు.

శంకర్‌రెడ్డి ఇన్‌చార్జి కాదు: ఎమ్మెల్యే

సత్యవేడు, జూలై 14 (ఆంధ్రజ్యోతి): టీడీపీ అధిష్ఠానం సత్యవేడుకు నూతనంగా నియమించిన కూరపాటి శంకర్‌రెడ్డి నియోజకవర్గానికి ఇన్‌ఛార్జి కాదని, ఆయన కేవలం పార్టీ ప్రోగ్రామ్స్ కో ఆర్డినేటర్ మాత్రమేనని ఎమ్మెల్యే ఆదిమూలం చెప్పారు. ఈ మేరకు నియామక పత్రంలో స్పష్టంగా ఉందన్నారు. సత్యవేడులో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. శంకర్‌రెడ్డిని నియోజకవర్గ ఇన్‌ఛార్జి అంటూ కొందరు సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెడుతున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజ్యాంగబద్ధంగా ఎన్నికైన ఎమ్మెల్యే స్థానంలో ఎవరినీ ఇన్‌చార్జిగా నియమించలేరన్నారు. శంకర్‌రెడ్డి తనకు మిత్రుడు, సన్నిహితుడంటూనే.. కూటమిలోని నాయకులను, కార్యకర్తలందరినీ కలుపుకొంటూ నియోజకవర్గ అభివృద్ధిపై చర్చించుకుని ముందుకు వెళ్లాలని సూచించారు. ఎమ్మెల్యేను వదిలేసి తిరిగితే ఎవరూ సహకరించరన్నారు. నియోజకవర్గానికి వస్తూనే ఫ్లెక్సీలు, అంగబలంతో బలప్రదర్శన చేయడం దేనికోసమన్నారు. ఆయనకు అధికారులు ఎస్కార్ట్‌తో స్వాగతం పలకడం, సెల్యూట్‌లు కొట్టడం ఎందుకని పోలీసులను ప్రశ్నించారు. దీనిపై ఎస్పీకి ఫిర్యాదు చేశానన్నారు. అధికారులను బెదిరిస్తున్నారని ఆరోపించారు.

సర్వదర్శనానికి 15 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 15 గంటల సమయం పడుతోంది. సోమవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్‌2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 9 షెడ్లలో సర్వదర్శన భక్తులు నిండిపోయి క్యూలైన్ శిలాతోరణం సర్కిల్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్‌1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

శనివారం హుండీ ఆదాయం: రూ.4.43 కోట్లు
ఆదివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 80,193
తలనీలాలు సమర్పించినవారు: 33,298

ప్రోగ్రెస్ రిపోర్ట్

కథనం, ఇంటర్వ్యూ : చిత్తూరు, ఆంధ్రజ్యోతి



ఏడాదిలో ఏం చేశారు? పరిశ్రమలు క్యూ కట్టబోతున్నాయి

- రూ.2వేల కోట్ల పెట్టుబడితో 'పాలీహోస్'
- రూ.వెయ్యి కోట్లతో భారత్ 'బయోటెక్'

2009లో ఏర్పడిన గంగాధరనెల్లూరు నియోజకవర్గానికి నాలుగో ఎమ్మెల్యేగా ప్రాతినిథ్యం వహిస్తున్నారు డాక్టర్ వీఎం థామస్. ఫెర్టిలిటీ వైద్యనిపుణుడిగా ఎంతో పేరున్న ఈయన.. ఎన్నికలకు ముందూ, గెలిచిన తర్వాతా గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో ఎన్నో హామీలు ఇచ్చారు. ప్రజలు అడిగినవెన్నో చేస్తానని చెప్పారు. తొలి ఏడాది వీటిలో ఈయన చేసినవి ఏవి? చేయాల్సివి ఏమిటి? మలి ఏడాది నిర్దేశించుకున్న లక్ష్యాలు ఏమిటి? ప్రజలు తమ ఎమ్మెల్యే నుంచి ఏమి కోరుతున్నారు... ఈ అంశాల సమాహారం ఇది...

తొలి ఏడాది ఇవి చేశాం...

- కుప్పం తర్వాత గంగాధరనెల్లూరు నియోజకవర్గంలోనే అత్యధిక పనులు జరిగాయి. నియోజకవర్గంలో 468 చోట్ల సీసీ రోడ్లను రూ.44.51 కోట్లతో పూర్తి చేశాం. రూ.4.34 కోట్లతో 37చోట్ల ఆర్‌అండ్‌బీ రోడ్లకు ప్యాచ్ వర్కులు చేశాం.
- రూ.6.38 కోట్లతో 336 గోకులం షెడ్లను, రూ.54 లక్షలతో 180 పశువుల నీటి తొట్టెలను నిర్మించాం.
- తొలి ఏడాదిలో రూ.55.75 కోట్లతో అభివృద్ధి పనుల్ని పూర్తిచేయగా, రూ.60కోట్ల పనులు పురోగతిలో ఉన్నాయి.
- 6 చోట్ల విద్యుత్తు సబ్‌స్టేషన్లను ఏర్పాటుచేశాం. కార్వేటినగరం మండలంలోని అన్నూరులో ట్రాన్స్‌ఫార్మర్ల స్టాక్ పాయింట్‌ను ఏర్పాటుచేశాం.
- బలిజకండ్రిగ నుంచి బెంగళూరుకు రెండు బస్సు సర్వీసులను ప్రారంభించాం. అలాగే కరోనా సమయంలో నిలిపేసిన సుమారు 15 బస్సు సర్వీసుల్ని పునరుద్ధరించాం.
- ఎస్ఆర్‌పురంలో కొత్త మార్కెట్ కమిటీ భవనాన్ని నిర్మిస్తున్నాం.
- జైన్ ఫ్యాక్టరీ ఎదురుగా రూ.3 కోట్లతో డీపీఆర్‌సీ బిల్డింగ్ నిర్మాణంలో ఉంది.
- పెనుమూరులో డయాలసిస్ కేంద్రం ఏర్పాటుకు సీఎంవో నుంచి ఆదేశాలు వచ్చాయి.

రెండో ఏడాది లక్ష్యాలు...

- కార్వేటినగరం మండలం కార్వేటినగరంలో రూ.1.20 కోట్లతో అన్న క్యాంటీన్‌ను ఏర్పాటు చేస్తాం.
- వెదురుకుప్పం మండలంలో డిగ్రీ కాలేజీ, ఐటీఐ ఏర్పాటుకు కృషి చేస్తాం.
- నియోజకవర్గంలో పెద్ద లైబ్రరీ ఏర్పాటు చేసే ఆలోచన ఉంది.
- అటు పుత్తూరు ఇటు చిత్తూరులో తప్ప మధ్యలో ఎక్కడా బస్టాండు లేదు. ప్రయాణికుల అవసరాల దృష్ట్యా మధ్యలో బస్టాండును ఏర్పాటు చేసే ఆలోచనలో ఉన్నాం.
- నియోజకవర్గంలో ఎక్కడా ఫైర్ స్టేషన్ లేదు. ఏదైనా అగ్ని ప్రమాదం జరిగితే పుత్తూరు లేదా చిత్తూరు నుంచి ఫైర్ వెహికల్ రావాలి. ఈ విషయం సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లాను. త్వరలో మంజూరు చేయనున్నారు.
- వారపు సంతలు రోడ్ల మీద పెట్టుకోకుండా, అన్ని మండలాల్లోనూ మార్కెట్ కాంప్లెక్స్‌లను నిర్మించే ఆలోచన ఉంది.
- జీడీనెల్లూరు నియోజకవర్గ కేంద్రంలో 50 పడకల ఆస్పత్రి ఏర్పాటు చేస్తాం.
- పాలసముద్రంలో గురుకుల బాలుర పాఠశాల మంజూరు ప్రోగ్రెస్‌లో ఉంది. తిరుమలరాజపురంలో కొత్తగా పీహెచ్‌సీ ఏర్పాటు చేస్తున్నాం.
- వెదురుకుప్పంలో మినీ స్టేడియం ఏర్పాటు చేస్తానని నారాయణస్వామి ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేదు. నేను ప్రత్యేక శ్రద్ధ తీసుకుని క్రీడా మంత్రితో మాట్లాడి రూ.3 కోట్లతో మినీ స్టేడియాన్ని మంజూరు చేయించాను. త్వరలో ఏర్పాటు అవుతుంది.



గతంలో పెనుమూరు మండలంలోని గంగుపల్లె చెరువు వద్ద పెనుమూరు - చిత్తూరు రోడ్డు దుస్థితి



పరిశ్రమలు వస్తున్నాయి

నియోజకవర్గం మీదుగా చిత్తూరు- తచ్చూరు నేషనల్ హైవే సుమారు 49 కిలోమీటర్లు ప్రయాణిస్తోంది. చిత్తూరు- తిరుపతి, చెన్నై- బెంగళూరు ఎక్స్‌ప్రెస్ హైవేలు సమీపంలోనే ఉన్నాయి. పారిశ్రామిక అభివృద్ధికి అనువైన ప్రాంతం ఇది. సీఎం చంద్రబాబు జీడీనెల్లూరుకు పెన్షన్లను పంచేందుకు వచ్చినప్పుడు 2వేల ఎకరాలను సేకరించాలని ఆదేశించారు. ఇండస్ట్రియల్ హబ్ ఏర్పాటుకు అనువుగా ఉండేలా ఇప్పటికే వెదురుకుప్పం మండలంలో వెయ్యి ఎకరాల్ని గుర్తించాం. జీడీనెల్లూరులో సేకరించిన భూమి 500 ఎకరాలు సిద్ధంగా ఉంది. ఈ ప్రాంతానికి భవిష్యత్తులో పరిశ్రమలు వరుస కట్టనున్నాయి. చిత్తూరు-తచ్చూరు హైవేను ప్రమోట్ చేసి పరిశ్రమల్ని ఆకర్షిస్తున్నాం.

రూ.121 కోట్ల పనులకు ప్రతిపాదనలు

ఎన్నికల హామీల మేరకు నియోజకవర్గంలో రహదారుల అభివృద్ధి, ఇతర పనులకు రూ.121 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాను. దగ్గరుండి నిధులు మంజూరు చేసుకుని పూర్తి చేస్తాను. బలిజకండ్రిగ నుంచి పుల్లయ్యగుంట వరకు 13 కిలోమీటర్ల డబుల్ రోడ్డు, కార్వేటినగరం- పచ్చికాపల్లం- కొత్తపల్లిమిట్ట రోడ్డు విస్తరణ, కృష్ణాపురం జలాశయ అభివృద్ధి.. తదితర పనులు ఇందులో ఉన్నాయి.

- తొలి ఏడాది రూ.115 కోట్లతో అభివృద్ధి పనులు
- రూ.121 కోట్ల పనులకు ప్రతిపాదనలు



? నియోజకవర్గంలో డిగ్రీ కాలేజీ ఏర్పాటు చేస్తామని యువగళం పాదయాత్ర సమయంలో లోకేశ్, ఎన్నికల సమయంలో మీరూ కూడా హామీ ఇచ్చారు. కాలేజీ మంజూరైందని కూడా చెప్తున్నారు. మరి ప్రారంభించేది ఎప్పుడు.

- అప్పలరాజు, ఉడుముల కుడితి, ఎస్ఆర్‌పురం మండలం

! హామీ మేరకు ఎస్ఆర్‌పురంలో మహిళా డిగ్రీ కాలేజీ మంజూరైంది. త్వరలో ఇక్కడ తాత్కాలిక భవనాల్లో తరగతులు ప్రారంభించనున్నాం.

- ఎమ్మెల్యే థామస్

ప్రజల ప్రశ్నలు - ఎమ్మెల్యే జవాబులు



? వెదురుకుప్పం మండలాన్ని తిరుపతిలో చేరుస్తామని ఎన్నికల్లో మీరు హామీ ఇచ్చారు. ఏడాది దాటింది ఎమ్మెల్యేగారూ.

- సదాశివం, గుండుపల్లె, వెదురుకుప్పం మండలం

! వెదురుకుప్పం, కార్వేటినగరం మండలాలను తిరుపతి జిల్లాలోకి కలుపుతానని నాతోపాటు ఎన్నికల సమయంలో సీఎం చంద్రబాబు, పాదయాత్రలో మంత్రి లోకేశ్ కూడా హామీ ఇచ్చారు. దానికి కట్టుబడి ఉన్నాం. జిల్లాల సర్దుబాటు సమయంలో ఆ రెండు మండలాలూ తిరుపతి జిల్లాలో కలుస్తాయి.

- ఎమ్మెల్యే థామస్



? పుల్లయ్యగుంట నుంచి బలిజకండ్రిగ వరకు 13 కిలోమీటర్లు సింగిల్ రోడ్డుగానే ఉంది. దీన్ని డబుల్ రోడ్డుగా మారుస్తానని హామీ ఇచ్చారు. పట్టించుకోండి ఎమ్మెల్యేగారూ.

- గురులింగమ్, పాలసముద్రం

! ఈ హామీ మరచిపోలేదు. దీని గురించి అసెంబ్లీలో కూడా మాట్లాడాను. రూ.10 కోట్లు అవసరం. ఈ ఆర్థిక సంవత్సరంలోగా మంజూరు అవుతుంది. ఈ ఏడాదిలోనే పనులు ప్రారంభిస్తాం.

- ఎమ్మెల్యే థామస్



? ఎన్నికల్లో గెలిస్తే నియోజకవర్గానికి పెద్దఎత్తున పరిశ్రమలు తీసుకొస్తానన్నారు. డిగ్రీ చదువుకున్న నేను స్థానికంగా ఉద్యోగాలు లేకపోవడంతో హైదరాబాదులో ఓ బిల్డర్ కంపెనీలో సూపర్‌వైజర్‌గా పనిచేసుకుంటున్నాను. పరిశ్రమలు వస్తే ఉద్యోగిగా స్థానికంగా పని చేసుకునే అవకాశం ఉంటుంది సార్.

- నరేష్, కండిగ గ్రామం, పెనుమూరు మండలం

! దేశ విదేశాల్లో నాకున్న పరిచయాలతో ఇప్పటికే పలువురు పారిశ్రామికవేత్తలను కలిశాను. పాలీహోస్ కంపెనీ వారితో ఇటీవల మాట్లాడాను. నియోజకవర్గంలో వారి పరిశ్రమ స్థాపన కోసం వెయ్యి ఎకరాలు కావాలన్నారు. సిద్ధం చేస్తున్నాం. రూ.2వేల కోట్లతో వారు పెట్టే పరిశ్రమతో 1,500 మందికి ఉపాధి లభిస్తుంది. అలాగే భారత్ బయోటెక్ కంపెనీతోనూ మాట్లాడాను. 500 ఎకరాల్లో వ్యాక్సిన్స్ ప్రొడక్షన్, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేస్తామన్నారు. రూ.వెయ్యి కోట్లతో ఏర్పాటు చేస్తే 500 మందికి ఉపాధి లభిస్తుంది. ఏడాదిలోగా సీఎం చంద్రబాబు చేతుల మీదుగా ఈ పరిశ్రమలకు శంకుస్థాపన చేయిస్తాను.

- ఎమ్మెల్యే థామస్



నాయుడుపేటలో చోరీకి గురైన బంగారు నగలు రికవరీ చేసిన పోలీసులు

పగలే ఇళ్లలో చొరబడి..!

- అంతర్రాష్ట్ర దొంగ అరెస్టు
- 416 గ్రాముల బంగారు నగలు స్వాధీనం

తిరుపతి(నేరవిభాగం), జూలై 14(ఆంధ్రజ్యోతి): పగటిపూటే ఇళ్లలోకి చొరబడి దొంగతనాలకు పాల్పడే అంతర్రాష్ట్ర నిందితుడు చందక మణికంఠను నాయుడుపేట పోలీసులు అరెస్టు చేశారు. అతడి నుంచి రూ.37.44 లక్షల విలువ చేసే 416 గ్రాములు బంగారు నగలను స్వాధీనం చేసుకున్నారు. ఈ వివరాలను సోమవారం తిరుపతిలో ఎస్పీ హర్షవర్ధనరాజు మీడియాకు వివరించారు. ఆయన తెలిపిన ప్రకారం.. పార్వతీపురం జిల్లాకు చెందిన చందక మణికంఠ డిగ్రీ వరకు బాగా చదివాడు. ఉన్నత శ్రేణిలో ఉత్తీర్ణత సాధించాడు. కష్టపడి పనిచేయడం ఇష్టంలేక ఈజీ మనీకి అలవాటు పడ్డాడు. తోటి స్నేహితులతో కలిసి మద్యానికి బానిసయ్యాడు. జీవితాన్ని ఎంజాయ్ చేయాలని భావించి పాత నేరస్థులతో కలసి దొంగతనాలకు దిగాడు. గతంలో జైలులో ఉండొచ్చిన వారితో చేతులు కలిపాడు. దొంగతనాల్లో ప్రావీణ్యం పొందాడు. ఈ క్రమంలో పార్వతీపురానికి చెందిన మహిళతో వివాహమైంది. పిల్లలు లేరు. విశాఖ పరిధిలోని మువ్వలపాల్లెం పోలీసు స్టేషన్ పరిధిలో మూడు ఇంటి దొంగతనాలు చేశాడు. ద్వారకాపురం స్టేషన్ పరిధిలో మరో మూడు కన్నాలేసి నేరాలకు పాల్పడ్డాడు. ఈ కేసుల్లో ఇతడిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు పంపగా, బెయిల్‌పై బయటకు వచ్చాడు. ఇతడిపై విశాఖ పోలీసులు సస్పెక్ట్ షీట్ ఓపెన్ చేశారు. తాజాగా తడ, నాయుడుపేట, శ్రీసిటీ, వరదయ్యపాలెం పరిధిలో పలు చోట్ల దొంగతనాలకు పాల్పడగా, కేసులు నమోదయ్యాయి. తాజాగా నాయుడుపేట పరిధిలోని ముగాంబిక దేవాలయం వీధిలోని గంగినేని హరీంద్ర ఇంటిలో దొంగతనానికి పాల్పడ్డాడు. 416 గ్రాముల బంగారు నగలు, అపహరించుకుని పరారయ్యాడు. నాయుడుపేట అర్బన్ సీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. ఎస్పీ ఆదేశాల మేరకు డీఎస్పీ చెంచుబాబు, సీఐ ఎం.బాబి, పోలీసులు సాంకేతిక పరిజ్ఞానంతో నిందితుడి కదలికలు గుర్తించి పట్టుకున్నారు. ఇప్పటి వరకు మణికంఠపై 14 కేసులు ఉన్నాయి. నిందితుడ్ని అరెస్టు చేసి చోరీ సొత్తు రికవరీలో ప్రతిభ కనపరచిన నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు, సీఐ బాబి, ఎస్ఐ ఆదిలక్ష్మి, హెడ్ కానిస్టేబుల్ రామ్మోహన్ రాజు, కానిస్టేబుళ్లు దయాకర్, భానుతేజ, వెంకటేశ్వర్లు, డ్రైవర్ సుబ్రహ్మణ్యంను ఎస్పీ అభినందించి రివార్డులు అందచేశారు.

భూ సమస్యలు పరిష్కరించండి మహాప్రభో..!

అధికారులతో అర్జీదారుల మొర
పీజీఆర్ఎస్‌కు 301 వినతులు



వినతులు స్వీకరిస్తున్న జేసీ శుభం బన్సల్

తిరుపతి(కలెక్టరేట్), జూలై 14(ఆంధ్రజ్యోతి): 'భూ సమస్యలు పరిష్కరించమని చాలా వారాలుగా తిరుగుతున్నాం.. పట్టించుకోవడం లేదు.. వాటిపై దృష్టి పెట్టండి మహాప్రభో' అంటూ పలువురు అర్జీదారులు అధికారులకు మొరపెట్టుకున్నారు. సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికకు హాజరైన ప్రజలతో కలెక్టరేట్ కిక్కిరిసింది. మొత్తం 301 అర్జీలు అందగా అందులో రెవెన్యూ శాఖకు 136 వచ్చాయి. వెంటనే పరిష్కరించాలని జేసీ శుభం బన్సల్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు.

పొదుపు డబ్బులు ఆర్పీ స్వాహా చేసింది



16ఏళ్లుగా మేము పొదుపు సంఘంలో సభ్యులుగా ఉన్నాం. గత ఏడాది నవంబరు నుంచి ఈ ఏడాది జూన్ వరకు చెల్లించిన పొదుపు సొమ్ము బ్యాంకులో జమకాలేదు. ఆర్పీ లతకు డబ్బు ఇస్తే ఆమె బ్యాంకులో కట్టి రసీదు తెచ్చి ఇచ్చేది. ఇటీవల మా వద్ద ఉన్న సంఘం పుస్తకాలు, బ్యాంకు రసీదులు ఆమె తీసుకుంది. బ్యాంకుకు వెళ్లి స్టేట్‌మెంట్ చూడగా మా గ్రూపునకు సంబంధించి రూ.6.80లక్షలు జమ కాలేదని బ్యాంకు అధికారులు తెలిపారు. దీనిపై విచారించగా నేను ఒకదాన్నే సొమ్ము స్వాహా చేయలేదు. మెప్మా అధికారులు, సిబ్బందికి వాటాలు ఇచ్చానని చెప్పింది. విచారణ జరిపి న్యాయం చేయండి.

- భాగ్యలక్ష్మి సంఘం సభ్యులు, కైకాల చెరువు, తిరుపతి

మా పిల్లలకు చదువు దూరం చేయొద్దు



కేవీబీపురం మండలం పాతపాళెం హరిజనవాడలో 30 ఏళ్లుగా ప్రాథమిక పాఠశాల ఉందని, 40 మంది పిల్లలు చదువుకుంటున్నారని, ప్రస్తుతం 3, 4, 5 తరగతుల విద్యార్థులను పక్క ఊరు స్కూల్‌కు పంపించాలని ఉపాధ్యాయులు ఒత్తిడి చేస్తున్నారని గ్రామస్తులు డీఆర్వో నరసింహులు దృష్టికి తీసుకెళ్లారు. రేషనలైజేషన్ పేరుతో పాఠశాలను తరలిస్తే తమ పిల్లలకు చదువు దూరమవుతుందని తెలిపారు. అలాగే ఏర్పేడు మండలం పల్లంపేట పాఠశాల విద్యార్థులను 3 కిలోమీటర్ల దూరంలో ఉన్న మరో పాఠశాలకు తరలించాలని అధికారులు పూనుకోవడం సబబు కాదని సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, సీఐటీయూ నేత సుబ్రహ్మణ్యం అన్నారు. కలెక్టర్ వెంకటేశ్వర్ చొరవ తీసుకుని పాఠశాలల తరలింపును అడ్డుకోవాలని కోరారు.

కలపాడు భూములు పంచాలి



వెంకటగిరి నియోజకవర్గం కలపాడులో ఉన్న ప్రభుత్వ భూమిని దళిత, గిరిజనులకు పంచాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బాలసుబ్రహ్మణ్యం డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. వారు మాట్లాడుతూ కలపాడు పంచాయతీ పరిధిలో 1,400 ఎకరాలకు పైగా ప్రభుత్వ మేత పోరంబోకు భూములు ఉన్నాయని, వాటిని గ్రామంలోని నిరుపేద కుటుంబాలకు రెండు ఎకరాల చొప్పున పంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో చెంగయ్య, కృష్ణయ్య, లోకేష్, చెంచుకుమార్, సమరం పాల్గొన్నారు.

రేషన్‌కార్డు లేకపోవడంతో ప్రభుత్వ పథకాలు వర్తించలేదు



తమకు రేషన్‌కార్డులు లేకపోవడంతో ప్రభుత్వ పథకాలు వర్తించడంలేదని సత్యవేడు మండలం పేరడం గ్రామం, ఎస్టీకాలనీకి చెందిన వెంకటరత్నం, వీరమ్మ తదితరులు అధికారులకు మొరపెట్టుకున్నారు. కూలీనాలి చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని, ఆస్తులు లేవని, పథకాలు ఇస్తే ఆసరాగా ఉంటుందని వేడుకున్నారు.

జాతీయ రహదారి పేరుతో చెరువులు పూడ్చేస్తున్నారు

జాతీయ రహదారుల విస్తరణ పేరుతో తూకివాకం, దామినేడు, ఓటేరు, పేరూరు చెరువులను పూడ్చివేస్తున్నారని జైహిందుస్థానీ పార్టీ నేత నీలకంఠ అన్నారు. చెరువులు ఉన్న ప్రాంతాల్లో నీటి వనరులను రక్షిస్తూ ఫ్లైవోవర్ నిర్మించాలని డీఆర్వో నరసింహులు దృష్టికి తీసుకెళ్లారు.




చిట్టెమ్మ (ఫైల్), వడమంచి శ్రీను (ఫైల్)

ఆ 9 మంది మృతుల్లో ఐదుగురు శ్రీకాళహస్తివారే

- మామిడి కోతలకు వెళ్లి విగతజీవులుగా మారిన గిరిజనులు
- మృతదేహాల రాకతో విషాదం

రైల్వేకోడూరు/శ్రీకాళహస్తి, జూలై 14 (ఆంధ్రజ్యోతి): వారంతా నిరుపేద గిరిజనులు. మామిడి సీజన్‌లో కాయల కోతలకు వెళుతుంటారు. అలా ఆదివారం అన్నమయ్య జిల్లా రాజంపేటలోని ఇసుకపల్లెలో మామిడి కోతకు వెళ్లారు. పని ముగించుకుని లారీలో కాయలను వేసుకుని వస్తుండగా పుల్లంపేట మండలంలోని రెడ్డిపల్లె చెరువుకట్ట వద్ద ఆదివారం రాత్రి లారీ బోల్తా పడింది. ఈ ఘటనలో 9 మంది మృత్యువాతపడ్డారు. వీరిలో నలుగురు రైల్వేకోడూరు మండలంలోని శెట్టిగుంట.. మిగిలిన ఐదుగురు శ్రీకాళహస్తి మండలం కలవగుంట, గుండ్లపల్లి, చుక్కలనిడిగల్లు ఎస్టీ కాలనీలకు చెందిన వారని తెలిసింది. వీరి మృతదేహాలు సోమవారం ఆయా కాలనీలకు చేరడంతో విషాదం నెలకొంది. శెట్టిగుంటతో పాటు శ్రీకాళహస్తి ప్రాంతంలోని వీరంతా బంధువులే. మృతి చెందిన వారిని గజ్జల గంగమ్మ, చిట్టెమ్మ, రాధమ్మ, జాని, వడమంచి శ్రీను, గజ్జల సుబ్బరత్న, గజ్జల దుర్గయ్య దంపతులుగా గుర్తించారు. వీరిలో వడమంచి శ్రీనుది శ్రీకాళహస్తి మండలం గుండ్లపల్లి.. చిట్టెమ్మది కలవగుంట ఎస్టీకాలనీలు. వీరి మృతదేహాలకు సోమవారం బొజ్జల బృందమ్మ నివాళులర్పించారు. మృతుల కుటుంబీకులకు ఆర్థికసాయం చేశారు. మిగతా ముగ్గురి విషయంలో స్పష్టత లేదు. కాగా, రాజంపేట ప్రభుత్వ ఆస్పత్రిలో శవపరీక్షలు పూర్తయి అంబులెన్సుల్లో ఆయా గ్రామాలకు మృతదేహాలను చేర్చారు.

అధిక లోడ్డే కారణం

ప్రమాదానికి గురైంది ఆరు టైర్ల లారీ. ఈ లారీలో సాధారణంగా 6 టన్నులే వేయాలి. దీనికన్నా ఎక్కువగా వేశారు. ముందు వెళుతున్న లారీని ఓవర్‌టేక్ చేసి ఆ తర్వాత ముందు వచ్చే కారును తప్పించాలని చూడటంతో బోల్తాపడిందని స్థానికులు స్థానికులు చెబుతున్నారు.

టీబీని దేశం నుంచి తరిమికొట్టాలి

● సెంట్రల్ టీబీ డివిజన్ డిప్యూటీ కమిషనర్ పిలుపు


ఎంఎల్‌హెచ్‌పీ పావనితో మాట్లాడుతున్న కేంద్ర అధికారులు

చిత్తూరు రూరల్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): టీబీని దేశం నుంచి 2025కల్లా తరిమికొట్టాలని సెంట్రల్ టీబీ డివిజన్ డిప్యూటీ కమిషనర్ భవాని సింగ్ పిలుపునిచ్చారు. సోమవారం జిల్లాలో జరుగుతున్న టీబీ ముక్త భారత్ కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 60 ఏళ్ల పైబడిన ప్రతి ఒక్కరికీ టీబీ స్ర్కీనింగ్ పరీక్షలు తప్పనిసరిగా చేయాలన్నారు. టీబీ నివారణ జిల్లా అధికారి వెంకటప్రసాద్ మాట్లాడుతూ.. జిల్లాలో ప్రతి సచివాలయ పరిధిలో రోజూ 10 మందికి టీబీ పరీక్షలు నిర్వహించాలని ఆదేశించామన్నారు. ఈ కార్యక్రమం డిసెంబరు వరకు కొనసాగుతుందని వివరించారు. ముందుగా జిల్లా టీబీ కార్యాలయాన్ని పరిశీలించాక పూతలపట్టులోని వేపనపల్లె హెల్త్ అండ్ వెల్‌నెస్ కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ పాల్గొన్నారు. అక్కడున్న ఎంఎల్‌హెచ్‌పీ పావనిని కార్యక్రమం గురించి అడిగి తెలుసుకుని, ఆమెను అభినందించారు. అనంతరం జీడీ నెల్లూరు మండలంలోని నెల్లేపల్లె హెల్త్ అండ్ వెల్‌నెస్ కేంద్రాన్ని తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. కేంద్ర బృందం సభ్యులు ధర్మారావు, గంగాధర్, ధీరజ్, టీబీ శాఖ అధికారులు మనోహర్‌రెడ్డి, జశ్వంత్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

భోజన ఏర్పాట్లు ఇలాగేనా?

- హెచ్‌ఎంల శిక్షణ తరగతుల్లో టీచర్ల నిరసన


నిరసన వ్యక్తం చేస్తున్న టీచర్లు

చిత్తూరు సెంట్రల్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ప్రధానోపాధ్యాయు (హెచ్‌ఎం)ల శిక్షణ తరగతులు ప్రారంభమైన తొలి రోజు మధ్యాహ్నం భోజనం ఏర్పాటులో సమగ్ర శిక్ష (ఎస్‌ఎస్) అధికారుల అలసత్వంపై టీచర్ల నిరసన వ్యక్తం చేశారు. నూతన జాతీయ విద్యా విధానంలో భాగంగా ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంలకు నేషనల్ ఇన్షియేటివ్ ఫర్ ప్రొఫిషియెన్సీ ఇన్ రీడింగ్ విత్ అండర్‌స్టాండింగ్ అండ్ న్యూమరీస్ (నిపుణ్)పై నాలుగు రోజుల శిక్షణ తరగతులను ఎస్‌ఎస్ ఏపీసీ వెంకటరమణ సోమవారం చిత్తూరులోని మిట్టూరులో ఉన్న అరుణాచల జూనియర్ కళాశాలలో ప్రారంభించారు. వీరికి పది మంది మాస్టర్ ట్రైనీలు శిక్షణ ఇస్తున్నారు. 282 మంది ప్రైమరీ స్కూల్ హెచ్‌ఎంలు పాల్గొన్న ఈ కార్యక్రమంలో భోజనం ఏర్పాట్లు సరిగ్గా లేకపోవడంపై నిరసన తెలిపారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన తమకు అనేక అనారోగ్య సమస్యలు ఉన్నాయని, సమయానికి భోజనం ఏర్పాటు చేయకపోతే ఎలా అని ప్రశ్నించారు. చాలీచాలనీ భోజనం వండటంతో సగానికిపైగా టీచర్లు గంటకుపైగా భోజనం కోసం నిరీక్షించాల్సి వచ్చింది.

'తోతాపురి' సబ్సిడీ దుర్వినియోగం కాకుండా చర్యలు చేపట్టాలి: కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): తోతాపురి మామిడి రైతులను ఆదుకునేందుకు సబ్సిడీ రూపంలో కిలోకు రూ.4 వంతున రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సాయం దుర్వినియోగం కాకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. సోమవారం రాత్రి కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో జేసీ విద్యాధరితో కలిసి వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇప్పటివరకు సుమారు మూడు లక్షల మెట్రిక్ టన్నుల తోతాపురి మామిడి రైతులనుంచి గుజ్జు ఫ్యాక్టరీలకు అందించడం జరిగిందన్నారు. కుప్పం, పలమనేరు నియోజకవర్గాల నుంచి మామిడి సేకరణ మరో 10-15 రోజులు కొనసాగవచ్చని చెప్పారు. ఇప్పటివరకు సేకరించిన తోతాపురి రకానికి సబ్సిడీ రూపంలో అందించిన రూ.120 కోట్లు రైతుల ఖాతాల్లో జమచేయడం జరుగుతుందన్నారు. జూన్‌నెల వరకు సేకరించిన మామిడి సబ్సిడీని జూలై నెలలో, జూలై నెలలో సేకరించిన మామిడి సబ్సిడీని ఆగస్టు నెలలో రైతుల ఖాతాలో జమచేస్తామన్నారు. జిల్లాస్థాయిలో సేకరించిన మామిడి రైతుల వివరాలు, తూకాలు తదితరాలను మండల అధికారులు గ్రామస్థాయి అధికారులతో సమన్వయం చేసుకుని సరిచూసుకోవాలన్నారు. రైతు బ్యాంకుల ఖాతాలకు సంబంధించి ఐఎఫ్ఎస్‌సీ కోడ్, ఈ-క్రాప్ పంటల వివరాలను పరిశీలించాలన్నారు. వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

టీచర్ల జాతీయ పురస్కారాలకు నామినేషన్ల గడువు 17వరకు పొడిగింపు

చిత్తూరు సెంట్రల్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): టీచర్ల 2025 జాతీయ పురస్కారాలకు ఆన్‌లైన్‌లో సెల్ఫ్ నామినేషన్ దాఖలు చేయడానికి మంగళవారంతో ముగియనున్న గడువును ఈనెల 17వ తేదీవరకు పొడిగించినట్లు డీఈవో వరలక్ష్మి సోమవారం ఒకప్రకటనలో తెలిపారు. హార్డు కాపీలను చిత్తూరు డీఈవో కార్యాలయంలో చేర్చాలని సూచించారు. టీచర్లవారీగా ఫైనల్ సబ్మిషన్ ఆఫ్ సెల్ఫ్ నామినేషన్ గడువు ఈనెల 20వ తేదీనాటికి ముగియనుందని అన్నారు.

తమిళ కళాకారుడి ఆత్మహత్య

చిత్తూరు రూరల్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు రూరల్ మండలంలో అరతల గ్రామం ప్రాంతంలో తమిళనాడుకు చెందిన నాటక కళాకారుడు ఆత్మహత్య చేసుకున్నారు. బీఎన్ఆర్ పేట పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. తమిళనాడు రాష్ట్రం షోలింగర్ పరిధిలోని సరికుల్లమేటు గ్రామానికి చెందిన జయకరన్(26) అనే వ్యక్తి అరతల గ్రామంలోని ద్రౌపదమ్మ ఆలయంలో జరుగుతున్న మహాభారత యజ్ఞ మహోత్సవంలో నాటక ప్రదర్శన కోసం వచ్చాడు. ఆదివారం రాత్రి కూడా బఫూన్ వేషధారణతో అందరినీ నవ్వించాడు. సోమవారం మధ్యాహ్నం ఆలయ సమీపంలోని మామిడి తోటలో లుంగీతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఆత్మహత్యపై స్థానికులు పలు అనుమానాలు వ్యక్తంచేస్తున్నారు. పూర్తివివరాలు పోలీసుల దర్యాప్తులోనే తేలనున్నాయి.

వెంకటగిరి పట్టుచీరకు జాతీయ గుర్తింపు

● కేంద్రమంత్రి నుంచి అవార్డు అందుకున్న కలెక్టర్ వెంకటేశ్వర్



తిరుపతి(కలెక్టరేట్), జూలై 14(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయిలో చేనేత, హస్తకళల విభాగంలో (వెంకటగిరి పట్టు చీరలకు) జిల్లాకు ప్రథమ బహుమతి లభించింది. కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన ఓడీఓపీ (వన్ డిస్ట్రిక్ వన్ ప్రొడక్ట్) జాతీయ అవార్డుల ప్రదానోత్సవంలో ఢిల్లీలోని భారత మండపం(ప్రగతిభవన్)లో నిర్వహించిన కార్యక్రమంలో కేంద్ర మంత్రి పీయూష్‌గోయల్, సీఎం రేఖ గుప్తా చేతుల మీదుగా మొదటి బహుమతి (బంగారు కేటగిరి)ని కలెక్టర్ వెంకటేశ్వర్ సోమవారం అందుకున్నారు. 'జిల్లాలో ఓడీఓపీ కింద ప్రోత్సహిస్తున్న వెంకటగిరి పట్టుచీరలు, స్థానికంగా చేనేత ఉత్పత్తుల వైశిష్ట్యం, నాణ్యత, గౌరవానికి జిల్లాకు మొదటి బహుమతి రావడం ఆనందంగా ఉంది. ఇలాంటి పురస్కారాలు కళాకారులను ప్రోత్సహించేలా ఉంటుంది.' అని కలెక్టర్ పేర్కొన్నారు.

గురుకుల పాఠశాలలో ఖాళీలకు 20న ప్రవేశ పరీక్ష

కుప్పం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): కుప్పంలోని గణేశ్‌పురం సమీపంలోని వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల పాఠశాలలో 2025-2026 విద్యా సంవత్సరానికి గాను 5, 6, 8 తరగతులలో మిగిలిన ఖాళీల భర్తీ కోసం ఈనెల 20వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె.సరోజ తెలిపారు. బీసీ గురుకుల పాఠశాలలో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ఈ ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామన్నారు. ఆధార్ కార్డు జిరాక్సుతోపాటు పాస్‌పోర్టు సైజ్ ఫొటో, ప్రస్తుతం చదువుతున్న పాఠశాల నుంచి స్టడీ సర్టిఫికెట్‌ను తీసుకొచ్చి ఈనెల 18వ తేదీలోపు పాఠశాలలో సమర్పించి దరఖాస్తు ఫారం సమర్పించి, వెంటనే హాల్ టిక్కెట్ పొందవచ్చన్నారు. ఇతర వివరాలకు ఫోన్‌నంబరు 7680845898 లో తనను సంప్రదించాలని కోరారు.

బాధలు వెల్లడించి.. పరిష్కారం ఆశించి..!

● కలెక్టరేట్‌లో జరిగిన 'పీజీఆర్ఎస్'లో అధికారులకు 299 అర్జీలు అందజేసిన జనం

చిత్తూరు అర్బన్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమానికి జనం తరలివచ్చారు. తమ బాధలు వెల్లడించి.. పరిష్కారం కోరారు. బాధితుల నుంచి అర్జీలను కలెక్టర్ సుమిత్‌కుమార్, జేసీ విద్యాధరి, పలువురు అధికారులు స్వీకరించారు. మొత్తం 299 అర్జీలు వచ్చాయి. వీటిల్లో.. రెవెన్యూశాఖకు 198, పోలీసుశాఖకు 9, పంచాయతీరాజ్‌కు 4, విద్యాశాఖకు 7, వికలాంగుల శాఖకు 5, డీఆర్‌డీఏకు 17, డ్వామాకు 5, విద్యుత్‌శాఖకు 5, పౌరసరఫరాల శాఖకు 7 అర్జీలతోపాటు పట్టు పరిశ్రమలశాఖ, డీఎంహెచ్‌వో, ఉద్యానశాఖ, రహదారులు, భవనాల శాఖ, ఎంపీడీవోలు, మున్సిపాలిటీ తదితర శాఖలకు 42 అర్జీలున్నాయి. అధికారుల దృష్టికి వచ్చిన అర్జీల్లో కొన్ని..

నగరికి ఎంపీ రావాలి

చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు ఏడాదైనా ఇంత వరకు నగరికి రాలేదని టీడీపీ నేత చలపతి, మహిళలు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ముందు ముఖాలకు మాస్కులు ధరించి నిరసన తెలిపారు. టీడీపీ తరఫున విజయం సాధించి ఏడాదవుతున్నా ఇంత వరకు నగరికి ఎందుకు రాలేదని ప్రశ్నించారు. ఎవరైనా ఎంపీని నగరికి రాకుండా అడ్డుకుంటున్నారా? అని నిలదీశారు. ఎంపీకి తగిన రక్షణ కల్పించాలని కలెక్టర్‌ను కోరారు. అన్ని నియోజకవర్గాలతోపాటు నగరిని అభివృద్ధి చేయడానికి ఎంపీ తనవంతు కృషి చేయాలని కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో టీడీపీ మహిళా నేతలు లత, అలిమేలు, భారతి, రాధ, హేమ, కన్నెమ్మ, తెలుగు యువత నేతలు అయ్యప్ప, రఘుపతి తదితరులు పాల్గొన్నారు.

అదనపు బోరు వేయండి

అదనపు బోరును వేయాలని పాలసముద్రం మండలం ఇందిరానగర్ గ్రామస్తులు డిమాండ్ చేశారు. కలెక్టరేట్ ముందు ఖాళీ బిందెలతో మహిళలు నిరసన తెలిపారు. గ్రామంలోని ఒక్క బోరు నుంచి వచ్చే నీరు తమ అవసరాలకు సరిపోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నీటికోసం రోజూ ఫర్లాంగుదూరం నడిచి వెళ్లాల్సి వస్తోందన్నారు.

జిల్లా పోలీసు కార్యాలయానికి 42 అర్జీలు


బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ మణికంఠ

జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమానికి 42 అర్జీలు వచ్చాయని ఎస్పీ మణికంఠ తెలిపారు. బాధితుల నుంచి అర్జీలను స్వీకరించిన ఆయన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. వేధింపులపై ఒకటి, కుటుంబ తగాదాలపై ఏడు, ఇంటి తగాదాపై ఒకటి, భర్త వేధింపులు ఒకటి, భూ తగాదాలపై 12, డబ్బు తగాదాలపై 13, దారి సమస్య ఒకటి, ఆస్తి తగాదాలపై ఆరు అర్జీల చొప్పున వచ్చాయని ఎస్పీ వివరించారు.


బాధిత మహిళ సమస్య తెలుసుకుంటున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

ఏఎన్ఎంలకు రీకౌన్సెలింగ్ నిర్వహించాలి

ఇటీవల జరిగిన ఏఎన్ఎంల బదిలీల కౌన్సెలింగ్‌లో అవినీతి, అక్రమాలు జరిగాయని ట్రైబల్ స్టూడెంట్స్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు అక్కులప్ప నాయక్ ఆరోపించారు. కలెక్టర్ చొరవ తీసుకుని రీకౌన్సెలింగ్ నిర్వహించి, ఏఎన్ఎంలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టరేట్ వద్ద ఏఎన్ఎంలతో కలిసి నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. డీఎంహెచ్‌వో, అధికారులు జీవోకు విరుద్ధంగా వ్యవహరించారని, కార్యాలయంలో పనిచేసే రూప్‌కుమార్ అనే వ్యక్తి అనేకమంది ఏఎన్ఎంల వద్ద బదిలీల కోసం డబ్బులు వసూలు చేశామని ఆరోపించారు.

ఐదు రోజుల్లోగా గోదాముల్లో

మౌలిక వసతులు కల్పించండి: కలెక్టర్


సమావేశంలో ప్రసంగిస్తున్న కలెక్టర్, పాల్గొన్న జేసీ, ఇతర అధికారులు

చిత్తూరు కలెక్టరేట్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): సింగిల్ విండోల్లో ఉన్న బహుళ ప్రయోజన గోదాము (ఎంపీఎఫ్‌సీ)ల్లో ఐదురోజుల్లోగా మౌలిక వసతులు కల్పించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో జిల్లా సహకార అభివృద్ధి కమిటీ సమావేశం జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో ఎంపీఎఫ్‌సీ గోదాములు తొలి దశలో 40 మంజూరవగా, 27 చోట్ల నిర్మాణం పూర్తయ్యిందన్నారు. మిగిలిన 13లో నాలుగు నిర్మాణ దశలో ఉండగా, మరో తొమ్మిది గోదాముల పనులు ప్రారంభం కాలేదన్నారు. 10 గోదాములకు రవాణా వాహనాల రాకపోకలకు రహదారి అభివృద్ధి, విస్తరణ అవసరమని చెప్పారు. జిల్లాలో 30,500 మెట్రిక్ టన్నుల వేరుశనగ విత్తనాల పంపిణీ జరిగిందని, రైతులకు సరిపడే ఎరువులు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. పంటసాగును బట్టి రైతు సేవాకేంద్రాల్లో ఎరువులు అందుబాటులో ఉంచడం జరుగుతుందన్నారు. సింగిల్ విండోల ద్వారా పెట్రోల్ బంక్‌లు, జనఔషధ కేంద్రాల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని సూచించారు. చిత్తూరు, గంగాధరనెల్లూరు, పలమనేరు, చవటగుంట ఏరియా ఆస్పత్రుల్లో జనఔషధకేంద్రాల ఏర్పాటు జరుగుతుందన్నారు. జేసీ విద్యాధరి, డీపీవో లక్ష్మి, డీసీసీబీ సీఈవో శంకర్‌బాబు, జడ్పీ సీఈవో రవికుమార్, డీఎస్వో శంకరన్, సివిల్ సప్లయీస్ డీఎం సుమతి, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

వైభవంగా సంకటహర గణపతి వ్రతం

● స్వర్ణ రథంపై విహరించిన వరసిద్ధుడు


ఆస్థాన మండపంలో సంకటహర గణపతి వ్రతం నిర్వహిస్తున్న భక్తులు- స్వర్ణ రథాన్ని లాగుతున్న ఈవో పెంచలకిషోర్, ఏఎస్పీ రాజశేఖర్‌రాజు తదితరులు

ఐరాల(కాణిపాకం), జూలై 14 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకంలో సోమవారం సంకటహర గణపతి వ్రతాన్ని ఆలయ అధికారులు భక్తుల చేత వైభవంగా నిర్వహింపజేశారు. ఈ సందర్భంగా ఉదయం మూల విరాట్‌కు అభిషేకం చేసి, సిద్ధి, బుద్ధి సమేత వరసిద్ధుడిని ఉత్సవర్లను ఆలయ ఆస్థాన మండపానికి తీసుకొచ్చారు. అక్కడున్న వేదికపై ఉత్సవర్లను కొలువుదీర్చి, ఎదురుగా భక్తులను కూర్చోబెట్టి వ్రతాన్ని నిర్వహించారు. రాత్రి ఉత్సవర్లను స్వర్ణరథంపై అధిష్ఠింపజేసి ఆలయ మాడవీధుల్లో ఊరేగించారు. స్వర్ణరథంపై స్వామిని దర్శించుకోవడానికి వందలాదిగా భక్తులు కాణిపాకం తరలివచ్చారు. ఈవో పెంచలకిషోర్, ఏఎస్పీ రాజశేఖర్‌రాజు ఆలయ ప్రధాన అర్చకుడు సోమశేఖర్ గురుకుల్, ఏఈవో రవీంద్రబాబు, సూపరింటెండెంట్లు కోదండపాణి, వాసు, ఇన్‌స్పెక్టర్లు చిట్టిబాబు, బాలాజీనాయుడు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకో మోడల్ ఎస్పీఎం కేంద్రం

- రాష్ట్రంలోనే తొలిసారిగా చిత్తూరులో ఏర్పాటు
- ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులకు కొత్త టెక్నాలజీ
- సదరన్ డిస్కం సీఎండీ సంతోషరావు


చిత్తూరు స్టోర్స్‌ను పరిశీలిస్తున్న సీఎండీ సంతోషరావు

చిత్తూరు రూరల్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మోడల్ స్పెషల్ మెయింటనెన్స్ ఆఫ్ ట్రాన్స్‌ఫార్మర్స్ (ఎస్పీఎం) కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు సదరన్ డిస్కం సీఎండీ సంతోషరావు తెలిపారు. రాష్ట్రంలోనే తొలిసారిగా చిత్తూరులో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశామని చెప్పారు. సోమవారం ఈ కేంద్రాన్ని ఆయన పరిశీలించి, ప్రసంగించారు. ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులకు కొత్త టెక్నాలజీని తీసుకొచ్చామని, మెరుగ్గా పనిచేస్తోందని చెప్పారు. ఆయిల్ రీజనరేషన్ మిషన్ అనే కొత్త టెక్నాలజీతో రెండు గంటల్లోనే వెయ్యి లీటర్ల ఆయిల్‌ను నాణ్యతతో ఫిల్టర్ చేస్తున్నామన్నారు. దీనిద్వారా ట్రాన్స్‌ఫార్మర్ల మన్నిక కాలం పెరుగుతుందని తెలిపారు. దీనివల్ల సమయం, డబ్బు ఆదా అవుతాయన్నారు. చిత్తూరు మోడల్ ఎస్పీఎం కేంద్రంలో రూ.40లక్షలతో పైలట్ ప్రాజెక్టుగా ఈ టెక్నాలజీ తీసుకొచ్చామని.. సత్ఫలితాలు ఇస్తోందని వెల్లడించారు. అనంతరం అధికారులతో మాట్లాడుతూ.. ఏఈలు పని చేసే చోట్ల నివాసం ఉండడం లేదన్నారు. దీనివల్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడిన సమయంలో అందుబాటులోకి రావడం లేదన్న ఫిర్యాదులు వస్తున్నాయని అసహనం వ్యక్తం చేశారు. ఇకపై అలా కుదరదని ఏఈలు ఆయా కేంద్రాల్లో తప్పనిసరిగా నివాసం ఉండాలని.. లేకుంటే చర్యలు తీసుకోవాలని ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్‌ని ఆదేశించారు. అనంతరం స్టోర్స్‌ని పరిశీలించారు. స్టోర్స్‌లో వాహనాల రాకపోకలకు రోడ్డు వేయాలని సూచించారు. విద్యుత్ శాఖ డైరెక్టర్ గురవయ్య, సీజీఎం జానకిరామ్, ఈఈ మునిచంద్ర, డీఈలు పాల్గొన్నారు.

1ఎం1బి ఫ్యూచర్ రెడీ ఇన్‌స్టిట్యూషన్‌గా కేఈసీ


1ఎం1బి ప్రతినిధులతో సునీల్ రాజ్

కుప్పం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): కుప్పం ఇంజనీరింగ్ కళాశాల 1ఎం1బి (వన్ మిలియం ఫర్ వన్ బిలియన్) సంస్థతో సోమవారం ఎంవోయూ కుదుర్చుకుంది. ఈ సందర్భంగా కళాశాల వైస్ చైర్మన్ డాక్టర్ సునీల్ రాజ్ మాట్లాడుతూ ఈ ఎంవోయూతో కేఈసీని 1ఎం1బి ఫ్యూచర్ రెడీ ఇన్‌స్టిట్యూషన్‌గా మార్చడానికి ఇది దోహదం చేస్తుందని చెప్పారు. ఈ సహకారంతో పరిశ్రమ-సమలేఖనం చేసిన నైపుణ్య అభివృద్ధి, విద్యార్థులకు మెరుగైన ప్లేస్‌మెంట్ కల్పించడంతోపాటు గ్లోబల్ ఎక్స్‌పోజర్‌పై దృష్టి పెట్టడానికి అవకాశం లభిస్తుందన్నారు. 2014లో స్థాపించబడిన 1ఎం1బి, ఐక్యరాజ్య సమితి ఎకోసాక్‌తో ప్రత్యేక సంప్రదింపుల హోదాను కలిగి ఉందని చెప్పారు. ఐక్యరాజ్యసమితి గ్లోబల్ కమ్యూనికేషన్స్ విభాగానికి అనుబంధంగా ఉందన్నారు. 1ఎం1బి ప్రతినిధులు మాట్లాడుతూ ఏఐ, గ్రీన్ స్కిల్స్‌పై తమ సంస్థ వివిధ కార్యక్రమాలు ఐక్యరాజ్యసమితి సస్టైనబుల్ డెవలప్‌మెంట్ గోల్స్‌తో అనుసంధానించబడ్డాయని చెప్పారు. ఇది ప్రధానంగా భారతదేశం నుంచి యువత నేతృత్వంలోని ఆవిష్కరణలు, మార్పులను న్యూయార్క్‌లోని ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యాలయంలో ఏటా జరిగే 1ఎం1బి యాక్టివేట్ ఇంపాక్ట్ సమ్మిట్‌లో పాల్గొనడానికి అవకాశం కల్పిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో కేఈసీ ప్రిన్సిపాల్ ఎస్.సుధాకర బాబు, 1ఎం1బి లీడ్-సస్టైనబిలిటీ అండ్ గవర్నమెంట్ అడ్వైజర్ దీపికా వెంకటేశ్, శిక్షణ అండ్ ప్లేస్‌మెంట్ అధికారి డి.జయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర దొంగ అరెస్టు

● వెండి, బంగారు ఆభరణాలు స్వాధీనం


నిందితుడు శక్తివేల్‌ను, స్వాధీనం చేసుకున్న ఆభరణాలను ప్రదర్శిస్తున్న డీఎస్పీ పార్థసారథి తదితరులు

కుప్పం, జూలై 14(ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లాలో ప్రత్యేకించి కుప్పం ప్రాంతంలో అనేక దోపిడీలకు పాల్పడిన జి.శక్తివేల్ (36) అనే అంతర్రాష్ట్ర దొంగను పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. కుప్పం డీఎస్పీ పార్థసారథి, కుప్పం రూరల్ సీఐ మల్లేశ్ యాదవ్‌లు సోమవారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. వివరాలిలా... అంతర్రాష్ట్ర దొంగ అయిన శక్తివేల్‌పై జిల్లాలో 14 దోపిడీ కేసులున్నాయి. ఇంకా తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లోనూ ఇతడిపై కేసులు నమోదయ్యాయి. తమిళనాడు రాష్ట్రం తిరుపత్తూరు జిల్లా కరుంబూర్ శక్తివేల్ సొంత గ్రామం. డ్రైవర్‌గా పనిచేస్తాడు. ఇతనిపై కుప్పంలో 5 కేసులు, వి.కోటలో 3కేసులు, బైరెడ్డిపల్లెలో 2 కేసులు నమోదయ్యాయి. అంతేకాక తమిళనాడు రాష్ట్రంలోని ఊత్తంగిరి, పెరుంబాక్కై, కోయంబత్తూరు, తిరుపూరు తదితర పోలీసు స్టేషన్లలో సైతం కేసులున్నాయి. నిఘా ఉంచిన కుప్పం పోలీసులు గుడుపల్లె మండలం చప్పిడిగురుగులు క్రాస్ వద్ద గతనెల 28వ తేదీన శక్తివేల్‌ను అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. తర్వాత ఈనెల 11న అతడిని పోలీసు కస్టడీకి తీసుకుని చోరీల గురించి విచారించారు. గుడుపల్లె, రాళ్లబూదుగూరు, రామకుప్పం పోలీసు స్టేషన్ల పరిధిలో నాలుగు ఇళ్లల్లో దొంగతనాలు చేసినట్లు నిందితుడు ఈ విచారణలో ఒప్పుకున్నాడు. దొంగిలించిన బంగారు, వెండి ఆభరణాలను తమిళనాడు రాష్ట్రంలోని తిరుపూర్ పట్టణంలోని రాజ్యలక్ష్మి జ్యువలరీ షాప్ వద్ద విక్రయించినట్లు తెలిపాడు. దీంతో నిందితుడిని తమిళనాడు రాష్ట్రంలోని సంబంధిత జ్యువలరీ దుకాణానికి తీసుకెళ్లి సుమారు 5 తులాల బంగారు, కిలోవెండి ఆభరణాలు పోలీసులు రికవరీ చేశారు. శక్తివేల్ అరెస్టులో నైపుణ్యం చూపిన పోలీసు సిబ్బందికి డీఎస్పీ పార్థసారథి రివార్డులు అందజేశారు. సమావేశంలో గుడుపల్లె ఎస్ఐ డి.శ్రీనివాసులు, రాళ్లబూదుగూరు ఎస్ఐ నరేశ్ పాల్గొన్నారు.

వెబ్ ల్యాండింగ్ ప్రక్రియను

ఆర్డీవోలే పర్యవేక్షించాలి:జేసీ

చిత్తూరు కలెక్టరేట్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): వెబ్ ల్యాండింగ్ ప్రక్రియను తహసీల్దార్లతో సమన్వయం చేసుకుని ఆర్డీవోలు స్వయంగా పర్యవేక్షించాలని జేసీ విద్యాధరి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్ నుంచి పెండింగ్‌లోని పీజీఆర్ఎస్ అర్జీలు, ఇళ్లపట్టాలు, కౌలు రైతులకు కార్డుల పంపిణీ, జాయింట్ ఎల్పీఎంలపై డీఆర్వో మోహన్‌కుమార్‌తో కలసి ఆర్డీవోలు, తహసీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వెబ్‌ల్యాండ్‌కు సంబంధించి ఒరిజినల్ ఫైల్స్‌ను తహసీల్దార్ల నుంచి తెప్పించుకుని ఆర్డీవోలే తమ కార్యాలయంలో స్వయంగా పరిశీలించి.. కలెక్టరేట్‌కు పంపాలన్నారు. ఇందుకోసం అవసరమైతే మండలాల నుంచి సిబ్బందిని కేటాయించుకోవాలని సూచించారు. అర్జీదారులను పదేపదే కార్యాలయాల చుట్టూ తిప్పుకోకుండా స్లాట్లు ఇచ్చి దరఖాస్తులను స్వీకరించాలన్నారు. రీసర్వేకు సంబంధించి మొదటి దశలో 31 గ్రామాల్లో ప్రక్రియ చేపట్టామని తెలిపారు. రీసర్వే పూర్తయిన గ్రామాలకు ఆర్డీవోలు వెంటనే ఆర్వోఆర్‌లను పబ్లిష్ చేయాలని ఆదేశాలిచ్చారు. మిగిలిన గ్రామాల్లో తహసీల్దార్లతో సమన్వయం చేసుకుని ఈ నెలాఖరులోగా నోటిఫికేషన్ పూర్తిచేయాలన్నారు. రేషన్ అందని అంగన్‌వాడీ కేంద్రాలను ఎఫ్‌పీ షాపులతో మ్యాపింగ్ చేసి.. ఇబ్బంది లేకుండా చూడాలని డీఎస్వో, సివిల్ సప్లయీస్ డీఎంలకు సూచనలిచ్చారు. కౌలురైతులకు వచ్చేవారంలోగా కార్డులు పంపిణీ చేయాలని చెప్పారు. జీవో నెం.30 ద్వారా భూమి ఆక్రమించుకున్న వారిలో అర్హులైన లబ్ధిదారులకు భూమి క్రమబద్ధీకరణ ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. సర్వేశాఖ ఏడీ జయరాజ్, డీఎస్వో శంకరన్, డిప్యూటీ కలెక్టర్లు అనుపమ, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణా కేసులో ప్రధాన నిందితుడి అరెస్టు

నగరి, జూలై 14 (ఆంధ్రజ్యోతి): స్టోన్ డస్ట్ ము సుగులో తమిళనాడుకు ఇసుక అక్రమ రవాణా చేస్తు న్న కేసులో ప్ర ధాన నిందితు డు భరత్‌ను సోమవారం అ రెస్టు చేశారు. టిప్పర్లకు ఇసుకపై డస్ట్ నింపడానికి వాడిన ఎక్స్‌కవేటర్‌ను సైతం స్వాధీనం చేసుకున్నారు. వేల్ అండ్‌కో క్రషర్ ద్వారా ఇసుకపై డస్ట్ నింపినందుకు దానిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడానికి సన్నాహాలు చేస్తున్నట్లు డీఎస్పీ సయ్యద్ మహమ్మద్ అజీజ్ తెలిపారు. తమిళనాడుకు ఇసుకను అక్రమంగా రవాణా చేస్తుండగా ఏడు టిప్పర్లను సీజ్ చేసి.. ఏడుగురు డ్రైవర్లను పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో ప్రధాన నిందితుడైన భరత్‌ను నగరి పట్టణ పరిధిలోని కీలపట్టు వద్ద సోమవారం ఉదయం తొమ్మిది గంటలకు అరెస్టు చేశారు. నిందితులను సోమవారం కోర్టులో హాజరుపరచగా ఈనెల 28వ తేదీవరకు జడ్జి జానకి రిమాండ్ విధంగా, సత్యవేడు సబ్‌జైలుకు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో సీఐ విక్రమ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మూడు టన్నుల తమిళనాడు బియ్యం స్వాధీనం

కుప్పం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం పెట్రోలు బంకు వద్ద అక్రమంగా రవాణా అవుతున్న 3 టన్నుల తమిళనాడు రేషన్ బియ్యం స్వాధీనం చేసుకుని ఇద్దరిని అరెస్టు చేసినట్లు కుప్పం డీఎస్పీ పార్థసారథి, రూరల్ సీఐ మల్లేశ్ యాదవ్ తెలిపారు. వారి కథనం మేరకు.. బియ్యం అక్రమ రవాణా జరుగుతున్నట్లు పోలీసులకు అందిన సమాచారం మేరకు రామకుప్పం ఎస్ఐ పి.వెంకట మోహన్, మండల రెవెన్యూ అధికారులు సోమవారం రామకుప్పం మండలంలో నిఘా ఉంచారు. ఈ క్రమంలో పెట్రోలు బంకు సమీపంలో ఉదయం వాహనాలు తనిఖీ చేస్తుండగా ఓ వాహనాపై అనుమానం వచ్చి ఆపారు. ఈ వాహనాన్ని తనిఖీ చేయగా అందులో తెల్లటి ప్లాస్టిక్ సంచుల లోడ్డు ఉంది. పోలీసులు రావడం చూసిన అందులోని ఇద్దరు వ్యక్తులు, డ్రైవర్‌తో సహా వాహనం తీసుకుని పారిపోవడానికి ప్రయత్నించారు. వెంబడించిన పోలీసులు వారిని నిలువరించి విచారించారు. వాహనంలో మూడు టన్నుల తమిళనాడు రేషన్ బియ్యాన్ని అక్రమంగా రవాణా చేస్తున్నట్లు నిర్ధారించారు. వాహనంలో ఉన్న వ్యక్తులను వి.కోట మండలానికి చెందిన ఆండియప్ప, రామకుప్పం మండలానికి చెందిన కుమార్ నాయక్‌లుగా గుర్తించారు. వారిద్దరితోపాటు వాహనం నడుపుతున్న రామకుప్పం మండలం ననియాల గ్రామానికి చెందిన డ్రైవర్ సాగర్‌ను అరెస్టు చేశారు. బియ్యంతోపాటు వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. సమావేశంలో డీఎస్పీ, రూరల్ సీఐతోపాటు రామకుప్పం ఎస్ఐ వెంకట మోహన్ పాల్గొన్నారు.

శ్రీకృష్ణదేవరాయల విగ్రహ ప్రతిష్ఠకు విరాళాలు


ఎగువపల్లెలో విరాళం అందజేస్తున్న దాతలు

సోమల, జూలై 14 (ఆంధ్రజ్యోతి): సోమల పట్టణం కృష్ణదేవరాయల సర్కిల్‌లో ఆయన విగ్రహ ప్రతిష్ఠకు ఎగువపల్లె నుంచి పలువురు దాతలు రూ.1,02,147 విరాళంగా అందజేసినట్లు కమిటీ అధ్యక్షుడు ఎన్. మునివెంకటప్ప, కార్యదర్శి ఎస్వీ. రమణ తెలిపారు. సోమవారం నెల్లిమంద పంచాయతీ ఎగువపల్లె ఆలయంలో గ్రామస్తులు, కమిటీ సభ్యులు సమావేశం నిర్వహించారు. ఈక్రమంలోనే సోమల జడ్పీటీసీ కుసుమ, మాజీ ఏఎంసీ ఛైర్మన్ అమాస మోహన్ దంపతులు రూ.20 వేలు, సాకిబండ నరసింహులు రూ. 10,116, జీసీ రాయప్ప రూ. 10 వేలు, లవ కుమార్, సీతారాం, నరసారెడ్డి, అభిషేక్, నవీన్, సుబ్రహ్మణ్యం రూ.5 వేలు వంతున అందజేసినట్లు కోశాధికారి జ్యోతీశ్వరుడు తెలిపారు. వీరితో పాటు పలువురు విరాళాలు అందజేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో విశాంత్ర ఎల్ఐ వెంకటరమణ, మాజీ సర్పంచు శ్రీరాములు, కామిశెట్టి నగేశ్, రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

చారాల కురప్పల్లెకు తీరిన తాగునీటి సమస్య

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


బోరుకు మరమ్మతులు చేస్తున్న పంచాయతీ సిబ్బంది

చౌడేపల్లె, జూలై 14 (ఆంధ్రజ్యోతి): చారాల కురప్పల్లెలోని తాగునీటి బోరుకు సోమవారం మరమ్మతులు చేయడంతో తాగునీటి సమస్య తీరింది. శనివారం 'ఆంధ్రజ్యోతి పత్రికలో 'కురప్పల్లెకు తాగునీటి కష్టాలు' అన్న శీర్షికతో కథనం ప్రచురితమైంది. ఇందుకు స్పందించిన అధికారులు సోమవారం తాగునీటి బోరులో పైపులు దించి సమస్యను పరిష్కరించారు. గత రెండు వారాలుగా తాగునీటి బోరులో పైపలకు నీరు అందక పోవడంతో తాగునీటికి ఇబ్బందులు పడ్డారు. బోరు మరమ్మతు చేయడంతో తాగునీటి సమస్య తీరింది.

పక్కా గృహాల కోసం స్థల పరిశీలన


మ్యాప్‌ను పరిశీలిస్తున్న కమిషనర్, రాజ్‌కుమార్ తదితరులు

కుప్పం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): పేదలకు నిర్మించనున్న పక్కా గృహాల కోసం మున్సిపల్ కమిషనర్ వి.శ్రీనివాసరావు, కడా సలహా మండలి సభ్యుడు రాజ్‌కుమార్ మంగళవారం స్థలాలను పరిశీలించారు. పురపాలక సంఘం పరిధిలోని చీలేపల్లె సమీపంలో ఉన్న ప్రభుత్వ స్థలానికి వెళ్లి, అక్కడ పక్కా గృహాల నిర్మాణానికి అనువుగా ఉన్నదో లేదో పరిశీలన చేశారు. అలాగే కుప్పం పట్టణంలోని ప్రధాన రహదారి నేతాజీ రోడ్డు విస్తరణ విషయంలో వీరు పరిశీలన చేశారు. రోడ్డు విస్తరణ కోసం అవసరమైన స్థల సేకరణ, ఉన్న అడ్డంకుల గురించి చర్చించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఉద్యోగులు, సిబ్బందితోపాటు వార్డు సభ్యులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

చంద్రబాబు ప్రభుత్వంలోనే రైతుల సంక్షేమం


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పీఎస్ఎం, సురేశ్ తదితరులు

కుప్పం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): సంక్షోభంలో ఉన్న మామిడి రైతులను వాస్తవంగా ఆదుకుంటోంది టీడీపీ ఆధ్వర్యంలోని ఎన్డీయే ప్రభుత్వమేనని ఆ పార్టీ నాయకులు తెలిపారు. రెచ్చగొట్టే పద్ధతులు, అవసరర విమర్శలు మాని వైసీపీ ప్రభుత్వంలో తామేం చేశారో జగన్ చెప్పాలని డిమాండ్ చేశారు. కుప్పం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పీఎస్.మునిరత్నం, టీడీపీ నియోజకవర్గ విస్తరణ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ బీఆర్.సురేశ్ బాబు విలేకరులతో మాట్లాడుతూ మామిడి రైతులకు ముఖ్యమంత్రి చంద్రబాబు అందిస్తున్న తోడ్పాటు గురించి వివరించారు. దిగుబడి అధికం కావడంతో పాటు నాణ్యతలేని గుజ్జుతో గుజ్జు తయారీ పరిశ్రమలు ఎగుమతులు నిలిచిపోయి ఇటు మామిడి రైతులు, ఇటు పరిశ్రమల వర్గాలు ఇబ్బందులు పడటం నిజమేనన్నారు. అయితే వెంటనే రంగంలోకి దిగిన టీడీపీ ప్రభుత్వం, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పరిస్థితులను చక్కదిద్దడానికి అనేక చర్యలు తీసుకున్నారన్నారు. ఇరువర్గాలతో సమావేశాలు జరిపి టన్ను తోతాపురి మామిడికి రూ.4 వేలు సబ్సిడీగా రైతులకు అందిస్తున్నారని గుర్తు చేశారు. రైతు పంటకు సంబంధించిన వే బిల్లు చూపితే సబ్సిడీ అతడి అకౌంట్‌లో జమ అవుతుందన్నారు. అయితే ఈ వాస్తవాన్ని ఏమాత్రం పట్టించుకోని జగన్ అండ్ కో రాద్ధాంతం చేయడానికి, రైతులను రెచ్చగొట్టడానికి ప్రయత్నిస్తున్నారని ధ్వజమెత్తారు. బంగారుపాళ్యంలో ఆయన సృష్టించిన హంగామా, చేసిన డ్రామాలు అందరికీ తెలిసిపోయిందన్నారు. జగన్ ప్రభుత్వంలో గిట్టుబాటు ధరలు , సబ్సిడీ ఇచ్చేవారు లేక రైతుల బతుకులు ఆగమైపోయాయని విమర్శించారు. ఇప్పుడు తగుదునమ్మా అంటూ రైతుల పక్షపాతిగా ఉన్నామని రాద్ధాంతం చేస్తున్న వారిని జగన్‌ను, ఆయన పార్టీని ఎవరూ నమ్మే పరిస్థితి లేదన్నారు. సమావేశంలో టీడీపీ కుప్పం రూరల్ మండలాధ్యక్షుడు ప్రేమ్‌కుమార్, టీటీడీ బోర్డు సభ్యులు వైద్యం శాంతారాం, కడా సలహా మండలి సభ్యులు రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

రాస్ నూతన కార్యవర్గం


నూతన కార్యవర్గాన్ని సన్మానిస్తున్న సభ్యులు

పలమనేరు, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : పలమనేరులో సోమవారం రెడ్డి అభ్యుదయ సంక్షేమ సంఘం నియోజకవర్గ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకొన్నారు. అధ్యక్షులుగా జయరాంరెడ్డి (పెద్దవెలగటూరు), ఉపాధ్యక్షులుగా రవిచంద్రారెడ్డి (కీలపట్ల), చంద్రారెడ్డి (సి.ఎల్లాగరం), ప్రధాన కార్యదర్శిగా వెంకటమునిరెడ్డి (నక్కపల్లి), జాయింట్ సెక్రటరీగా వేమారెడ్డి (ముదరాంపల్లి), గంగాధర రెడ్డి (తాతిరెడ్డిపల్లి), కోశాధికారిగా ఎన్.ప్రతాపరెడ్డి (ఏడూరు), పీఆర్‌వోలుగా ఎన్.శీనురెడ్డి (జరావారిపల్లి), వి.మంజునాథరెడ్డి (కంచిరెడ్డిపల్లి), సలహాదారులుగా బి.ఎం.కిషోర్‌గౌడు (బైరెడ్డిపల్లి), ఆర్.అమరనాథరెడ్డి (గంగవరం), మల్లేశ్వరరెడ్డి (కాప్పల్లి), గౌరవాధ్యక్షులుగా నాగరాజరెడ్డి (ముసలిమడుగు), రవికుమార్‌రెడ్డి (ఇల్లూరు)లతోపాటు 25 మంది సభ్యులుగా ఎంపిక చేశారు.

విద్యుత్ తీగల చోరీ

చౌడేపల్లె, జూలై 14 (ఆంధ్రజ్యోతి): చారాల కురప్పల్లె గ్రామానికి తాగునీరు అందించే బోరు విద్యుత్ తీగలు చోరీకి గురైనట్లు ఎంపీడీవో లీలామాధవి తెలిపారు. ఆదివారం రాత్రి చారాల కురప్పల్లె తాగునీటి బోరుకు విద్యుత్ తీగలు అమర్చి మరమ్మతులు చేశారు. అయితే ఉదయానికే గుర్తు తెలియని వ్యక్తులు 60 మీటర్ల విద్యుత్ తీగలు చోరీ చేయడంతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

పుర సేవలు వినియోగించుకోండి

కుప్పం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'పుర మిత్ర, మన మిత్ర' యాప్ సేవలు వినియోగించుకోవాలని కుప్పం మున్సిపల్ కమిషనర్ వి.శ్రీనివాసరావు ప్రజలను కోరారు. ఈ యాప్ ద్వారా ఆస్తి పన్ను, నీటి పన్ను, లైసెన్స్ తదితర వివరాలు తెలుసుకోవడంతోపాటు పురపాలక సంఘ కార్యాలయానికి వెళ్లకుండానే ఇంట్లో కూర్చుని చెల్లింపులు చేయొచ్చన్నారు. పుర మిత్ర యాప్, మన మిత్ర వాట్సాప్ 9552300009 సేవలను వినియోగించుకోవాలన్నారు. మున్సిపల్ సిబ్బంది ఇంటికి వచ్చినప్పుడు ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని సహకరించాలని కోరారు.

పెరిగిన తోతాపురి ధరలు

సోమల, జూలై 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక మామిడి మండీలు, ర్యాంపుల వద్ద తోతాపురి రకం టన్ను రూ.8 వేలకు చేరుకుంది. తోటల్లో కాయలు ముగింపు దశకు చేరుకోవడంతో ధరలు పెరుగుతున్నాయి. మండలంలో విస్తారంగా నీలం రకం ఉండటంతో టన్ను రూ. 20 వేలు మించి పలికింది. దీంతోపాటు రైతుల నుంచి తోటలు లీజుకు తీసుకున్న వ్యాపారులు నీలం రకం కాయల కోతలు చేపట్టారు. రైతులు తమ తోటల్లోని కాయలను మండీలు మూసి వేస్తారని ముందస్తుగానే కోతలు పూర్తి చేశారు. పెద్దఉప్పరపల్లె, ఆవులపల్లె, అన్నెమ్మగారిపల్లె, పేటూరు పంచాయతీల పరిధిలోనే వందల ఎకరాల్లో నీలం రకం కాయలు కోతలు చేయాల్సి ఉంది. నీలం కాయలు దెబ్బతినకుండా ఉండేందుకు, ఈజీల నివారణకు మందులు పిచికారీ చేపట్టారు.

భగవద్గీతపై ప్రచారం

సోమల, జూలై 14 (ఆంధ్రజ్యోతి): భగవద్గీత జ్ఞానంతో సమాజంలో ఉన్న కులమతాల అసమానతలు తొలగి సర్వమతాలకు దేవుడొక్కడేనని భావనతో దైవభక్తి పెంపొందుతుందని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి సభ్యులు పేర్కొన్నారు. సోమవారం ఆవులపల్లె, పత్రపల్లె, కొత్తూరు, గాంధీనగర్‌లల్లో భగవద్గీత పఠనంపై ప్రచారం చేపట్టారు. పలువురికి గ్రంథాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు హేమగిరి పాల్గొన్నారు.

'సుపరిపాలనలో తొలి అడుగు' వినతులకు పరిష్కారం

సోమల, జూలై 14 (ఆంధ్రజ్యోతి): 'సుపరిపాలనలో తొలి అడుగు' వినతులకు పరిష్కారం చూపుతామని టీడీపీ మండలాధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు తెలిపారు. ఈమేరకు ఆయన సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ప్రజల నుంచి అందిన వినతులను ఎంపీడీవో నారాయణ, తహసీల్దార్ మధుసూదన్ దృష్టికి తీసుకెళ్లారు. త్వరితగతిన సమస్యలు పరిష్కరించాలని కోరారు. ప్రజా సమస్యలను క్షేత్ర స్థాయిలో అధికారులు పరిశీలించి న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో సింగల్‌విండో ఛైర్మన్ శివశంకర్, మాజీ వైస్ఎంపీపీ ఉమాపతి నాయుడు, వేణుగోపాల్ నాయుడు, అష్రఫ్‌అలీ, సతీశ్, రఫీ, రమణయ్య, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.


సూపర్‌సిక్స్ మేనిఫెస్టోతో మోసం: పెద్దిరెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

రొంపిచెర్ల, జూలై 14 (ఆంధ్రజ్యోతి): చంద్రబాబు, పవన్ కల్యాణ్ సూపర్ సిక్స్ మేనిఫెస్టో పేరుతో ప్రజలను మోసం చేశారని పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. సోమవారం రొంపిచెర్ల-పెద్దగొట్టిగల్లు మార్గంలోని కల్యాణ మండపంలో బాబు ష్యూరిటీ- మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా రొంపిచెర్ల మండల వైసీపీ శ్రేణులతో సమావేశాన్ని నిర్వహించారు. పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జడ్పీ మాజీ వైస్ ఛైర్మన్ పి.పెద్దిరెడ్డి, రాష్ట్ర వైసీపీ కార్యదర్శి ఎన్.అనీషారెడ్డి, మాజీ టీటీడీ సభ్యులు పోకల అశోక్‌కుమార్, జడ్పీటీసీ రెడ్డీశ్వరరెడ్డి, ఎంపీపీ పురుషోత్తంరెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ సలీంబాషా, మండల పార్టీ అధ్యక్షుడు కరీముల్లా, నాయకులు మహబూబ్‌బాషా, అల్లాబక్షు పాల్గొన్నారు.

● **కల్లూరు:** మేనిఫెస్టో పేరుతో చంద్రబాబునాయుడు ప్రజలను మరోసారి మోసం చేశారని పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆరోపించారు. పులిచెర్ల మండలం కల్లూరులో సోమవారం బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ పేరుతో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు అశోక్‌కుమార్, సురేంద్రనాథరెడ్డి, వృద్ధిరెడ్డి, నాధమునిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రామకుప్పం పీఏసీఎస్ ఛైర్మన్‌గా మహ్మద్‌రఫీ



రామకుప్పం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) అధ్యక్షుడిగా గొరివిమాకులపల్లెకు చెందిన మహ్మద్‌రఫీ నియమితులయ్యారు. మహ్మద్‌రఫీ గొరివిమాకులపల్లె పంచాయతీ సర్పంచిగా పనిచేశారు. మొన్నటి వరకు టీడీపీ రామకుప్పం-1 క్లస్టర్ ఇన్‌చార్జిగా కొనసాగారు. సంఘం సభ్యులుగా చెల్దిగానిపల్లె సురేశ్, గంగప్ప నియమితులయ్యారు.

లైన్‌మెన్లకు పదోన్నతులు కల్పించాలి


విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద నిరసన తెలుపుతున్న జూనియర్ లైన్‌మెన్‌లు

పుంగనూరు రూరల్, జూలై 14 (ఆంధ్ర జ్యోతి): జూనియర్ లైన్‌మెన్లకు అసిస్టెంట్ లైన్‌మెన్లగా పదోన్నతి కల్పించాలని, తమ న్యాయమైన కోర్కెలు పరిష్కరించాలంటూ జూనియర్ లైన్‌మెన్లు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట ముందు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాత సర్వీసు రూల్స్ మేరకు జూనియర్ లైన్‌మెన్లకు అసిస్టెంట్ లైన్‌మెన్లుగా పదోన్నతి కల్పించాలని, ఉద్యోగ సమస్యలను పరిష్కరించాలని, నూతన రూల్స్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు


బైరెడ్డిపల్లె : తీర్థంలో సంక్షేమ పథకాల కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు


పుంగనూరు మండలం సింగిరిగుంటలో ఇంటింటా అభివృద్ధిని తెలియజేస్తున్న టీడీపీ నాయకులు

బైరెడ్డిపల్లె, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ మండలాధ్యక్షుడు కిశోర్‌గౌడు, ప్రధాన కార్యదర్శి సుబ్రహ్మణ్యంశెట్టి కోరారు. సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని తీర్థం గ్రామంలో ఇంటింటికీ వెళ్లిప్రభుత్వ కార్యక్రమాలకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు గోవిందస్వామి, రమేష్, శ్రీనివాసమూర్తి, కృష్ణప్ప, విశ్వనాథ్, మహబూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

● **రామకుప్పం:** రాష్ట్రంలోని ప్రజల సంక్షేమమే ధ్యేయంగా సీఎం చంద్రబాబు పాలన సాగిస్తున్నారని టీడీపీ మణీంద్రం యూనిట్ ఇన్‌చార్జి వెంకటరమణ, పార్టీ పంచాయతీ అధ్యక్షుడు మంజునాథరెడ్డి తెలిపారు. సోమవారం కంబాలదేవులపల్లెలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో పాల్గొన్నారు. నేతలు దివాకర్, నారాయణరెడ్డి, సుబ్రహ్మణ్యం, జయంత్, బాలకృష్ణారెడ్డి, హనుమంతు పాల్గొన్నారు.

● **పుంగనూరు రూరల్:** తెలుగుదేశం ప్రభుత్వంలోనే గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి జరుగుతున్నట్లు పుంగనూరు టీడీపీ మండలాధ్యక్షుడు మాధవరెడ్డి తెలిపారు. సోమవారం మండలంలోని సింగిరిగుంట పంచాయతీలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో అభివృద్ధి పనులను ప్రజలకు వివరించారు. టీడీపీ నాయకులు గంగాధర్, రామాంజులు, అంజిరెడ్డి, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ఉనికి కోసమే చంద్రబాబుపై వైసీపీ విమర్శలు


సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

పుంగనూరు, జూలై 14 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ఉనికి కోసమే సీఎం చంద్రబాబుపై పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి విమర్శలు చేస్తున్నారని టీడీపీ మండలాధ్యక్షుడు మాధవరెడ్డి అన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఆయనతో పాటు టీడీపీ నాయకులు మాట్లాడుతూ ఏడాది ప్రభుత్వ పాలనలో రాష్ట్రాభివృద్ధితో పాటు పేదలకు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు వివరించారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో దోపిడీలు, అరాచకాలు, అక్రమాలు, దౌర్జన్యాలు, తప్పుడు కేసులు, విధ్వంసాలతో ప్రజలను భయాందోళనకు గురిచేయడంతో ఎన్నికల్లో వైసీపీకి కేవలం 11 సీట్లు వచ్చాయన్నారు. ప్రభుత్వంపై ఏడాది పాలనలో ప్రజా వ్యతిరేకత వచ్చినట్లు చెబుతున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి కుటుంబ సభ్యులు తమ పదవులకు రాజీనామా చేసి ఎన్నికలకు ప్రజాక్షేత్రానికి వచ్చి నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు. జనసేన మండలాధ్యక్షుడు విరూపాక్షి మాట్లాడుతూ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌పై విమర్శలు మానుకోవాలని, లేనిపక్షంలో వైసీపీ నాయకులకు ప్రజలే బుద్ధి చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. సమావేశంలో నాయకులు ఎం.శ్రీకాంత్, సుహేల్‌బాషా, సీవీరెడ్డి పోలీసుగిరి, జగదీశ్ రాజు, కోలాట వెంకటరమణ, ఐటీడీపీ కుమార్, గంగాధర్, చైతన్యరాయల్, సుబ్రహ్మణ్యం, వెంకటరెడ్డి, రమణ, చంద్ర, ప్రసాద్, హరి, హరినాయక్, బాలాజీ నాయక్, శ్రీరాములు, ప్రసాద్‌స్వామి, నరేష్‌రాయల్ తదితరులు పాల్గొన్నారు.

'పీజీఆర్ఎస్' వినతులకు తక్షణ పరిష్కారం: ఆర్డీవో


ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న ఆర్డీవో పి.భవాని

పలమనేరు, జూలై 14 (ఆంధ్రజ్యోతి): మండలాల్లోని అధికారులు 'పీజీఆర్ఎస్' వినతులకు తక్షణ పరిష్కారం చూపాలని ఆర్డీవో పి.భవాని సూచించారు. సోమవారం పలమనేరు ఆర్డీవో కార్యాలయంలో జరిగిన పీజీఆర్ఎస్ కార్యక్రమానికి రెవెన్యూ డివిజన్ పరిధిలోని రైతులు ప్రజలు పలు సమస్యలపై ఆర్డీవోకు వినతులు అందించారు. వినతులను పరిశీలించి ఆయా మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలతో మాట్లాడి సమస్యలను పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

పంచలోహ విగ్రహాల వితరణ


గంగమ్మ, పోతులరాజు పంచలోహ విగ్రహాలు

రామకుప్పం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): రామకుప్పంలోని ప్రధాన గ్రామ దేవత దిగువవీధి గంగమ్మ ఆలయానికి స్థానిక యువకులు పంచలోహ ఉత్సవ విగ్రహాలను వితరణగా ఇచ్చారు. దశాబ్దాలుగా ఆలయంలో గంగమ్మ, పోతురాజు సాధారణ ఉత్సవ విగ్రహాలు ఉండేవి. స్థానికంగా ఉండే యువకులు ఆలయానికి పంచలోహ విగ్రహాలు ఇవ్వాలని సంకల్పించారు. గత కొన్నేళ్లుగా చీటీలు నడుపుతూ వచ్చిన ఆదాయంతో గంగమ్మ, పోతులరాజు పంచలోహ విగ్రహాలను తయారు చేయించారు. సోమవారం వాటిని ఆలయ నిర్వాహకులకు అప్పగించారు. సోమవారం సాయంత్రం వేదపండితులు పార్థంది నాగరాజశర్మ విగ్రహాలకు ప్రాణప్రతిష్ఠ చేసి ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు.

మురుగునీటి కాలువలు ఏర్పాటు చేయాలి


మున్సిపల్ కమిషనర్ ఎన్.వి.రమణారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న పీపీఎస్ నాయకులు

పలమనేరు, జూలై 14 (ఆంధ్రజ్యోతి): పలమనేరులో దుస్థితిలో ఉన్న మురుగునీటి కాలువలు బాగు చేయించాలని.. కొత్తకాలువ నిర్మాణం పేరుతో మూడేళ్ల కిందట కాలువను తవ్వి అలాగే విడిచిపెట్టేశారని.. వెంటనే సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం పలమనేరు పరిరక్షణ సమితి(పీపీఎస్) నాయకులు మున్సిపల్ కమిషనర్ ఎన్.వి.రమణారెడ్డికి సోమవారం వినతిపత్రం అందజేశారు. అలాగే ఆక్రమణలు తొలగించాలని కోరారు. కార్యక్రమంలో పలమనేరు పరిరక్షణ సమితి అధ్యక్ష, కార్యదర్శులు సుబ్రహ్మణ్యంపిళ్లై, నరసింహులుతో పాటు సభ్యులు గోవిందయ్య, నారాయణప్ప పాల్గొన్నారు.

సింగిల్‌విండోలకు పాలకమండళ్ల నియామకం

కుప్పం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): కుప్పం నియోజకవర్గంలోని ప్రాథమిక సహకార సంఘాలకు (సింగిల్ విండోలు) పాలకమండళ్లను నియమిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. కుప్పం సింగిల్ విండో ఛైర్మన్‌గా కృష్ణమూర్తి, సభ్యులుగా కృష్ణవేణి, అన్నాదొరైలు నియమితులయ్యారు. అలాగే గుడుపల్లె సింగిల్ విండో ఛైర్మన్‌గా ఎం.రమేష్, సభ్యులుగా వెంకటేష్, కృష్ణప్ప, శాంతిపురం సింగిల్ విండో ఛైర్మన్‌గా గోపాల్, సభ్యులుగా హరికుమార్, దామోదరం, రామకుప్పం సింగిల్‌విండో ఛైర్‌పర్సన్‌గా మహమ్మద్ రఫీ, సభ్యులుగా సురేష్, అంజప్పలను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

బాలిక అదృశ్యం

సోమల, జూలై 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నదేవళకుప్పానికి చెందిన బాలిక (15) గత మూడు రోజుల నుంచి అదృశ్యమైనట్లు సోమవారం తల్లిదండ్రులు సోమల పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ శివశంకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మామపై పోలీసులకు ఫిర్యాదు

పుంగనూరు రూరల్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): తనను ఇంట్లో నుంచి వెళ్లిపోవాలని.. లేకుంటే చంపేస్తామని మామతో పాటు సమీప బంధువు తరచూ బెదిస్తున్నారని మండలంలోని భీమగానిపల్లె పంచాయతీ ఉలవలదిన్నె గ్రామానికి చెందిన సావిత్రి సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసుల కథనం మేరకు.. ఉలవలదిన్నె గ్రామానికి చెందిన కృష్ణప్ప కుమారుడు హరితో అదే గ్రామానికి చెందిన చిన్నయ్య కుమార్తె సావిత్రికి వివాహమైంది. కొంతకాలంగా భర్త హరి అనారోగ్యంతో ఉంటూ కొన్నాళ్ల క్రితం మృతి చెందాడు. ఈ నేపథ్యంలో మామ కృష్ణప్పతోపాటు సమీప బంధువు గణేష్ సావిత్రిని ఇంట్లో నుంచి వెళ్లిపోవాలని బెదిరించారు. దీంతో ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటరమణ తెలిపారు.

ద్విచక్ర వాహనం చోరీ

పుంగనూరు రూరల్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): తన ద్విచక్రవాహనం చోరీకి గురైందని బాధితుడు భాస్కర్ సోమవారం పుంగనూరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి కథనం మేరకు.. అన్నమయ్య జిల్లా మదనపల్లె మండలం జంగాలపల్లెకు చెందిన భాస్కర్ పుంగనూరు మండలం ఈడిగపల్లెలోని స్నేహితుడు శంకర్ ఇంటికి ఆదివారం రాత్రి వచ్చాడు. సోమవారం ఉదయం ద్విచక్రవాహనం కనిపించకపోవడంతో చుట్టుపక్కల వెతికినా ఫలితం లేకపోయింది. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

27న పుంగనూరులో కరాటే అకాడమి ప్రారంభం


మహేశ్ మార్షల్ ఆర్ట్స్ ఆకాడమి బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న సీఐ సుబ్బరాయుడు


పుంగనూరు రూరల్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ఈనెల 27న పుంగనూరులో కరాటే అకాడమి ప్రారంభించడం సంతోషకరమని.. చిన్న వయస్సులోనే పిల్లలు కరాటే నేర్చుకోవడంతో శారీరకంగా.. మానసికంగా ఎదుగుతారని పుంగనూరు సీఐ సుబ్బరాయుడు అన్నారు. సోమవారం స్థానిక పోలీసుస్టేషన్‌లో మహేశ్ మార్షల్ ఆర్ట్స్ ఆకాడమి బ్రోచర్లను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాస్టర్లు హేమంత్, రెడ్డిమహేశ్, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నత్తనడకన భూసార పరీక్ష కేంద్ర నిర్మాణం



సోమల, జూలై 14 (ఆంధ్రజ్యోతి): సోమల మండల కేంద్రంలో నియోజకవర్గ స్థాయి భూసార పరీక్ష కేంద్ర భవన నిర్మాణ పనులు గత నాలుగేళ్లుగా నత్తనడకన సాగుతున్నాయి. త్వరలో పూర్తి చేస్తే రైతులు తమ పొలాల్లోని మట్టిని పరీక్షించుకొని భూసార లోటుపాట్లతో పంటలను సాగుచేసుకునే అవకాశం ఉంటుదని రైతులుఎదురు చూస్తున్నారు. రొంపిచెర్ల, పులిచెర్ల, సదుం మండలాల రైతులు సుదూరంలోని పుంగనూరుకు వెళ్లే కష్టం తగ్గుతుంది. ఇకనైనా అధికారులు స్పందించి పనులు పూర్తి చేసి ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

దుర్గంకొండలో అభిషేక పూజలు


ప్రత్యేక అలంకరణలో మునీశ్వరుడు

సోమల, జూలై 14 (ఆంధ్రజ్యోతి): దుర్గంకొండలో సోమవారం గార్గేయ మహర్షి ప్రతిష్ఠించిన మునీశ్వరస్వామికి అభిషేక పూజలు చేపట్టారు.అలాగే చెన్నపట్నం చెరువు సమీపంలోని నేల మల్లేశ్వరస్వామి, సోమల స్వయంభేశ్వరస్వామికి ఉభయదారులు వివిధ రకాల పుష్పాలతో అలంకరణ చేపట్టారు. ఆలయం వద్ద నిర్మాణంలోని కల్యాణ మండపానికి దాతలు నానబాల మునిలక్ష్మమ్మ, మధులత రూ.10,001 విరాళం ఆలయ ధర్మకర్త సోమశేఖర్‌కు అందజేశారు.

అలంకరణలో అగస్త్యేశ్వరస్వామి


అగస్త్యేశ్వరస్వామి


అలంకరణలో కాశీవిశ్వేశ్వరస్వామి

పుంగనూరు, జూలై 14 (ఆంధ్ర జ్యోతి): పుంగనూరు కోనేరు వద్ద వెలసిన కాశీవిశ్వేశ్వరస్వామి సోమవారం ప్రత్యేక అలం కరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. మండలంలోని నెక్కుంది సమీపంలో వెలసిన అగస్త్యేశ్వరస్వామి ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అర్చకులు స్వామి వారిని అలంకరించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, చేశారు.

శభాష్ యువత

● కోదండరామాలయ భూమి రక్షణకు చర్యలు



స్థలాన్ని శుభ్రం చేయించిన యువకులు

పూతలపట్టు, జూలై 14 (ఆంధ్రజ్యోతి): పి.కొత్తకోట గ్రామంలో ఉన్న కోదండ రామస్వామి ఆలయానికి సంబంధించిన భూమిని అదే గ్రామానికి చెందిన యువకులు ఎక్స్‌కవేటర్‌తో శుభ్రం చేశారు. గ్రామం నడిబొడ్డున ఈ స్థలంలో 20 ఏళ్లుగా పిచ్చిమొక్కలు, రాళ్లరప్పలు ఉండటంతో విషసర్పాల బెడద ఎక్కువైంది. మరోవైపు అన్యాక్రాంతమయ్యే అవకాశం ఉందని భావించిన గ్రామానికి చెందిన యువకులు ఆ స్థలాన్ని శుభ్రం చేశారు. ఇక్కడ మరో ఆలయం నిర్మించడానికి వారు సిద్ధపడుతున్నారు. దీనిపై యువకులను గ్రామస్తులు అభినందించారు.

చంద్రబాబు పాలనలోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

● ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్



ప్రజలకు కరపత్రాలు పంచుతున్న ఎమ్మెల్యే జగన్మోహన్, నాయకులు

చిత్తూరు సిటీ, జూలై 14 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు పాలనలోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ అన్నారు. 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో భాగంగా సోమవారం నగరంలోని 20, 23, 25 డివిజన్లలోని జానకారపల్లె, శంకరయ్యగుంటలో టీడీపీ నేతలతో కలసి ఎమ్మెల్యే పర్యటించారు. ప్రభుత్వం ఏడాది కాలంలో చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, చుడా చైర్‌పర్సన్ కటారి హేమలత, మేయర్ అముద, కాజూరు బాలాజి తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ పరిజ్ఞానంతో ఉన్నత స్థాయికి ఎదగొచ్చు



విద్యార్థులతో కలిసి సైన్స్ పరికరాల వివరాలను తెలుసుకుంటున్న బాలాజీనాయుడు

గుడిపాల, జూలై 14 (ఆంధ్రజ్యోతి): సైన్స్ పరిజ్ఞానంతో ఉన్నత స్థాయికి ఎదగవచ్చని మాజీ జడ్పీటీసీ బాలాజీనాయుడు, శ్రీరంగంపల్లె జడ్పీ హైస్కూల్ హెచ్ఎం మధు అన్నారు. సోమవారం శ్రీరంగంపల్లె జడ్పీ హైస్కూల్‌లో హెల్త్ ఎడ్యుకేషన్ అడాప్షన్ రీహేబిటేషన్ డెవలప్‌మెంట్ సొసైటీ సహకారంతో మొబైల్ బస్సు పర్యటనను ప్రారంభించారు. సైన్స్ సిటీ, రాష్ట్ర ప్రభుత్వ మద్దతుతో ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తామన్నారు. అనంతరం ప్రాజెక్టు యువ విద్యావేత్త మధులాష్‌బాబు మాట్లాడుతూ.. 16 ఆధునిక సాంకేతిక అంశాలపై ప్రత్యక్ష ప్రదర్శనలు ఉంటాయన్నారు. విశ్రాంత ప్రధానోపాధ్యాయురాలు సమిత, విక్టర్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి: టీడీపీ



కరపత్రాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

నగరి, జూలై 14 (ఆంధ్రజ్యోతి): చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని నగరి టీడీపీ నాయకులు అన్నారు సోమవారం నగరి టీడీపీ అధ్యక్షుడు రమేష్ బాబు అధ్యక్షతన 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమాన్ని పెరుమాళ్ గుడి వీధిలో నిర్వహించారు. నాయకులు గుణశేఖర్, మదన్, గుణశేఖర్, మహేంద్రబాబు, కన్నా, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ లెక్కల నుంచి మా స్థలాన్ని తొలగించండి

● తహసీల్దార్‌కు జర్నలిస్టు కాలనీ వాసుల వినతి

చిత్తూరు రూరల్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): 'కొంగారెడ్డిపల్లెలో 1979 సంవత్సరంలో సర్వే నెంబరు 475/1, 470/1లో 24 మందికి అప్పటి జేసీ పట్టాలు మంజూరు చేశారు. ఇందులో 12 ప్లాట్లకు సంబంధించిన స్థలం ప్రభుత్వ లెక్కలో చూపుతోంది. దాన్ని తొలగించాలి' అని జర్నలిస్టు కాలనీవాసులు కోరుతున్నారు. ఈ మేరకు సోమవారం చిత్తూరు అర్బన్ తహసీల్దార్ కులశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. అన్ని అప్రూవల్స్ తీసుకుని ఇళ్లు కట్టుకున్నామని, ప్రభుత్వ లెక్కల్లో స్థలం ఉండటంతో బ్యాంకుల్లో లోన్లు రావడం లేదని వాపోయారు. పిల్లల చదువులకు ఫీజు చెల్లించలేక ఇబ్బంది పడుతున్నామని చెప్పారు. కాగా, పీజీఆర్ఎస్‌కు రేషన్ కార్డులు, ఇంటి పట్టాలు ఇవ్వాలని 10 అర్జీలు వచ్చాయని తహసీల్దార్ తెలిపారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చూపుతాం: మాజీ ఎంపీ

గుడిపాల, జూలై 14 (ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ సత్తా చూపుతామని మాజీ ఎంపీ రెడ్డెప్ప అన్నారు. సోమవారం వసంతాపురం గ్రామంలో మండల అధ్యక్షుడు ప్రకాష్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. చిత్తూరు వైసీపీ సమన్వయకర్త విజయానందరెడ్డి మాట్లాడుతూ.. బెదిరింపులకు భయపడకుండా గ్రామస్థాయిలో పార్టీని బలోపేతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ప్రసాదరెడ్డి, నాయకులు కలైఅరసి, రజనీకాంత్, ప్రసాదరెడ్డి, గుణవతి, జయకోటి తదితరులు పాల్గొన్నారు.

యాదమరి పీఏసీఎస్ చైర్‌పర్సన్‌గా చిత్ర



డైరెక్టర్లు మహబూబ్ బాషా, ప్రభాకర్

యాదమరి, జూలై 14 (ఆంధ్రజ్యోతి): యాదమరి మండల ప్రాథమిక సహకార సంఘ (పీఏసీఎస్) చైర్‌పర్సన్‌గా బోదగుట్టపల్లె పంచాయతీ పెరగాండ్లపల్లె గ్రామానికి చెందిన వి.చిత్ర నియమితులయ్యారు. డైరక్టర్లుగా ఎస్.మహబూబ్ బాషా (జోడిచింతల), డి.ప్రభాకర్ (జంగాలపల్లి)లను ప్రభుత్వం నియమించింది. తమకీ పదవులు ఇవ్వడంపై సీఎం చంద్రబాబుకు, ఎమ్మెల్యే మురళీమోహన్‌కు, మండల నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

మనోవ్యధకు కోరికలే కారణం

చిత్తూరు కల్చరల్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): మనోవ్యధకు కోరికలే కారణమని అభయ్ హిందూ సేన వ్యవస్థాపకుడు రాధామనోహర్ దాస్ అన్నారు. నాగయ్య కళాక్షేత్రంలో కేవలామృతం ప్రవచన కార్యక్రమాల్లో భాగంగా సోమవారం ఆయన మాట్లాడుతూ.. నిత్యం యోగా, దైవ ప్రార్థన, సర్దుకుపోవడం చిన్ననాటి నుంచే అలవాటు చేసుకోవాలని సూచించారు. రాధ కేవలం కృష్ణుడిని ప్రేమతో ఆరాధించిందే తప్ప ఎలాంటి కోర్కెలు కోరలేదని తెలిపారు. అందుకే వారి ప్రేమ చిరస్మరణీయమన్నారు. ఈ ప్రవచన కార్యక్రమం మంగళవారంతో ముగుస్తుందని నిర్వాహకుడు కళ్యాణ చక్రవర్తి తెలియజేశారు.

చంద్రబాబును కలిసిన గంధమనేని



శ్రీరంగరాజపురం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబును సోమవారం అమరావతిలో ఎస్ఆర్‌పురం టీడీపీ అధ్యక్షుడు గంధమనేని జయశంకర్ నాయుడు మర్యాద పూర్వకంగా కలిశారు. మండలంలో టీడీపీ పరిస్థితిని తెలియజేశారు.



నిత్యం గిరింపేటలో ఇదే పరిస్థితి

ట్రాఫిక్ వలయంలో గిరింపేట / ఇబ్బంది పడుతున్న జనం

చిత్తూరు కల్చరల్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): గిరింపేటలో నిత్యం ట్రాఫిక్ సమస్యతో జనం ఇబ్బంది పడుతున్నారు. గిరింపేట మెయిన్ రోడ్డు మీదుగా కలెక్టర్‌తోపాటు జిల్లా అధికారులు తమ కార్యాలయాలకు రాకపోకలు సాగిస్తుంటారు. పలు కార్పొరేట్ విద్యాసంస్థల వాహనాలు, తమిళనాడుకు వెళ్లే వాహనాలు కూడా ఈ మార్గంలోనే ప్రయాణిస్తుంటాయి. దీనివల్ల తరచూ ట్రాఫిక్ స్తంభిస్తోంది. మెయిన్ రోడ్డులోని చిదంబరేశ్వర ఆలయానికి ప్రతి సోమవారం భక్తులు అధిక సంఖ్యలో వాహనాల్లో వస్తుంటారు. ఈ వాహనాలను రోడ్డుపై అడ్డదిడ్డంగా నిలపడమూ ట్రాఫిక్ సమస్యకు మరో కారణంగా మారుతోంది. ఇక్కడ ప్రధాన రహదారి విస్తరణకు నోచుకోక ఇబ్బంది పడుతున్నట్లు జనం చెబుతున్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

దివ్యాంగులను ఆదరించడమే లక్ష్యం: ఎమ్మెల్యే భానుప్రకాష్



దివ్యాంగులకు బ్యాటరీ ట్రైసైకిళ్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే భానుప్రకాష్

నగరి, జూలై 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో దివ్యాంగులను ఆదరించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే భానుప్రకాష్ అన్నారు. నగరి సీపీఎస్ ఉన్నత పాఠశాల ఆటస్థలంలో సోమవారం జరిగిన దివ్యాంగులకు పరికరాల పంపిణీలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎవరిని ఆదుకోవాలన్నా సీఎం చంద్రబాబు వల్లే సాధ్యమవుతుందని చెప్పారు. రూ.54 లక్షల విలువైన బ్యాటరీ ట్రైసైకిళ్లు, కర్రలు, తోపుడుబండ్లు, వినికిడి యంత్రాలను పంపిణీ చేశారు. ఆర్డీవో అనుపమ, వికలాంగుల సంక్షేమ శాఖ ఏడీ వినోద్, నగరి మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి, ఎంపీడీవో కృష్ణయ్య, నగరి టీడీపీ అధ్యక్షుడు రమేష్‌బాబు, కార్యదర్శి శ్రీనివాసన్, టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి బాలాజి, దేశమ్మగుడి మాజీ చైర్మన్ కృష్ణారెడ్డి, సీనియర్ నాయకులు గుణశేఖర్, జ్యోతి నాయుడు, ఎం.వి.శ్రీనివాసులు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

నిండ్ర, జూలై 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా సీఎం చంద్రబాబు పనిచేస్తున్నారని ఎమ్మెల్యే భానుప్రకాష్ అన్నారు. అరూరు పంచాయితీ అరూరు దళితవాడలో సోమవారం సాయంత్రం 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఏడాది కాలంలో జరిగినా అభివృద్ధి పనులను వివరిస్తూ కరపత్రాలను జనానికి అందజేశారు. ఎంపీడీవో శివప్రసాద్ వర్మ, తహసీల్దార్ శేషగిరి, టీడీపీ మండల అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, నేతలు చిట్టిబాబు నాయకులు, ఆనందరాజు, రఘుపతి యాదవ్, సుధాకర్ నాయుడు, అయ్యప్ప, ఏలుమలై, పయణి, రంజిత్, బాబుయాదవ్, వెంకటేశులు, నరేష్, నంద, మురళీ నాయుడు, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రగతికి కూటమి పాలనే శరణ్యం

● ఎమ్మెల్యే మురళీమోహన్



ఈచనేరిపల్లెలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్

బంగారుపాళ్యం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అరాచక పాలనతో సర్వనాశనమైన రాష్ట్రాన్ని ప్రగతి పథంలో పెట్టాలంటే చంద్రబాబు నాయకత్వంలోని కూటమి పాలనే శరణ్యమని పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ అన్నారు. సోమవారం టీడీపీ మండల అధ్యక్షుడు ఎస్పీ ధరణీప్రసాద్ ఆధ్వర్యంలో మండలంలోని టేకుమంద,కీరమంద,కామాక్షిపురం, మొగిలి, వినాయకపురం, తుంబపాళ్యం, కచ్చేట్టివారిపల్లె, ఈచనేరిపల్లె, తుంబకుప్పం గ్రామాల్లో 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏడాది పాలనలో జరిగిన అభివృద్ధిపై ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఈచనేరిపల్లెకి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు శివరాజ్‌ను ఎమ్మెల్యే పరామర్శించారు. అనంతరం నలగాంపల్లెకి చెందిన జ్యోతీశ్వర్‌రావుకు సీఎం సహాయ నిధి నుంచి రూ.2లక్షల చెక్కును అందజేశారు. ఏఎంసీ మాజీ చైర్మన్ జయచంద్రనాయుడు, సింగిల్ విండో చైర్మన్ హేమచంద్రనాయుడు, నాయకులు జనార్థన్‌గౌడ్, కోదండయాదవ్, కోకా ప్రకాష్‌నాయుడు, రమేష్, ఎగ్గిడి భాస్కర్, శ్రీనివాసులు, మంజునాథ్, బాలసుబ్రమణ్యం, హరిప్రసాద్, దొరబాబు, గిరిబాబు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యలపై ప్రత్యేక దృష్టి : తహసీల్దార్



సమావేశంలో ప్రసంగిస్తున్న తహసీల్దార్ రమేష్ బాబు

పూతలపట్టు, జూలై 14 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక దృష్టి సారిస్తామని తహసీల్దార్ రమేష్ బాబు అన్నారు. ఎంపీడీవో కార్యాలయ ఆవరణంలో సోమవారం ఎంపీపీ కుమారి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొంతమంది రైతులు పట్టాభూముల్లో దారి కావాలంటూ అర్జీలు ఇస్తున్నారని చెప్పారు. వీటిని త్వరలోనే పరిష్కరిస్తామన్నారు. ఐసీడీసీ అధికారులు మాట్లాడుతూ.. అంగన్‌వాడీకి సంబంధించి ఏవైనా సమస్యలుంటే తమ దృష్టికి తేవాలని కోరారు. కాగా, కొందరు అధికారులు ఒకట్రెండు మాటలతో తమ ప్రసంగాన్ని ముగించడంపై, ఇంకొందరు అధికారులు సమావేశానికి హాజరు కాకపోవడంపై ప్రజాప్రతినిధులు అసహనం వ్యక్తం చేశారు. జడ్పీటీసీ దేవిక, ఎంపీడీవో నాగరాజు, వైస్ ఎంపీపీ ద్వారకనాథ రెడ్డి, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు జయచంద్రారెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

యువకుడిపై హత్యాయత్నం



గాయపడ్డ రామ్‌విలాస్ పాశ్వాన్

బంగారుపాళ్యం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ఓ యువకుడిపై హత్యాయత్నం జరిగింది. సీఐ కత్తి శ్రీనివాసులు తెలిపిన వివరాల మేరకు.. తుంబకుప్పం దళితవాడకు చెందిన బాబు కుమారుడు రామ్‌విలాస్ పాశ్వాన్ (28) తన వ్యవసాయ పొలంలో వరినారు వేశాడు. విరుపాక్షపురం గ్రామానికి చెందిన అహ్మద్ బాషాకు చెందిన మేకలు తన వరినారును మేసేశాయని రామ్‌విలాస్ పాశ్వాన్ ఆదివారం ప్రశ్నించడంతో వారి మధ్య గొడవలు జరిగాయి. దీన్ని మనసులో పెట్టుకున్న అహ్మద్ బాషా.. కక్షగట్టి సోమవారం ఉదయం తుంబకుప్పం బస్టాప్ వద్ద రామ్‌విలాస్ పాశ్వాన్ వెలుతుండగా కత్తితో దాడి చేశాడు. ఎడమ కాలు, చేయిపై బలంగా నరికాడు. తీవ్రగాయాలైన రామ్ విలాస్ పాశ్వాన్‌ను కుటుంబీకులు బంగారుపాళ్యం ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. తర్వాత మెరుగైన వైద్య నిమిత్తం చీలాపల్లె సీఎంసీకి తరలించారు. ఈ మేరకు అహ్మద్‌బాషాపై హత్యాయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. గ్రామంలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు.

కుటుంబ కలహాలతో యువకుడి ఆత్మహత్య



పెనుమూరు, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ రామచంద్ర తెలిపిన వివరాల మేరకు.. కుటుంబ కలహాల కారణంగా గొడుగుమానుపల్లెకు చెందిన దయాసాగర్(26) సోమవారం తన పొలంలోని మామిడి చెట్టుకు ఉరేసుకున్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

మద్యం మత్తులో మరొకరు..?

వెదురుకుప్పం: మద్యం మత్తులో దేవరాజులు (45) ఉరేసుకుని ఆత్యహత్య చేసుకున్నట్లు కార్వేటినగరం మండలం ఎర్రమరాజుపల్లె కాలనీవాసులు సోమవారం తెలిపారు. ఇతనికి ఇంకా వివాహం కాలేదు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు అందలేదు.

గ్రావెల్ తరలిస్తున్న ఆరు టిప్పర్ల సీజ్



సీజ్ చేసిన టిప్పరు

పాలసముద్రం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): వడకుప్పం గ్రామం నుంచి తమిళనాడుకు గ్రావెల్ అక్రమంగా తరలిస్తున్న ఆరు టిప్పర్లను సోమవారం తహసీల్దార్ అరుణకుమారి సీజ్ చేశారు. వనదుర్గాపురం పంచాయతీలో కొన్ని నెలలుగా తమిళనాడుకు చెందిన వ్యాపారులు ఎలాంటి అనుమతులు లేకుండా గ్రావెల్‌ను తరలించుకెళ్లి, సొమ్ము చేసుకుంటున్నారు. దీనిపై స్థానికులు, కమ్యూనిస్టు నాయకులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో తహసీల్దార్ తన సిబ్బందితో వెళ్లి దాడిచేసి.. ఆరు టిప్పర్లను సీజ్ చేసి, పాలసముద్రం ఎస్ఐ చిన్నరెడ్డెప్పకు అప్పగించారు. టిప్పర్ల డ్రైవర్లపై కేసు నమోదు చేశారు. దాడుల్లో డీటీ రుషివర్మ, ఆర్ఐ దేవి, వీఆర్వో వెంకటాచలం తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన



వెదురుకుప్పం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని గిరిజన భవన్ వద్ద ఈ నెల 12,13 తేదీల్లో జరిగిన రాష్ట్రస్థాయి ఆటల పోటీల్లో తిరుమలయ్యపల్లె జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారని హెచ్ఎం చాముండేశ్వరి తెలిపారు. గ్రాబ్లింగ్‌లో పదో తరగతి విద్యార్థులు యామిని (44 కిలోలు) హేమశ్రీ (61 కిలోలు), 9వ తరగతి విద్యార్థిని చైతన్య (34 కిలోలు) గోల్డ్ మెడల్స్ సాధించారన్నారు. 9వ తరగతి విద్యార్థి ప్రతిష్ఠ (48కిలోలు) సిల్వర్ మెడల్ సాధించినట్లు చెప్పారు. పి.భాహర్షిణి, భవ్యలు రజత పతకాలు వచ్చాయని వివరించారు. వీరిని సోమవారం అభినందించినట్లు తెలిపారు.

చెరువును తలపిస్తున్న రోడ్డు



శ్రీరంగరాజపురం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): 49.కొత్తపల్లెమిట్ట నుంచి విలాస వరాహపురానికి వెళ్లే సిమెంట్ రోడ్డుపై చిన్నపాటి వర్షానికే నీరు నిలిచిపోతోంది. దీనివల్ల స్థానికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఇకనైనా ఈ సమస్యను పరిష్కరించాలని జనం కోరుతున్నారు.

వైభవంగా చక్రస్నానం



పుష్కరిణిలో చక్రస్నానం నిర్వహిస్తున్న అర్చకులు (ఇన్‌సెట్లో) ఉత్సవర్లకు అభిషేకం

తవణంపల్లె, జూలై 14 (ఆంధ్రజ్యోతి): టి.పుత్తూరు కోదండరామాలయంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా చక్రస్నానం, వసంతోత్సవాన్ని సోమవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి తిరుమంజనం, క్షీరాభిషేకంతోపాటు ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం మోహినీ ఉత్సవం, సాయంత్రం ఉట్లోత్సవం జరిగింది. అనంతరం ఉత్సవర్లను పుష్కరిణి వద్దకు వేంచేపు చేసి, చక్రస్నానం చేశారు. రాత్రి ధ్వజావరోహణం, ఏకాంత సేవను నిర్వహించారు. ఆలయ ధర్మకర్త సిద్ధేశ్వరరెడ్డి, ఉభయదారులు, టి.పుత్తూరు, పరిసర గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

లోకేశ్‌ను కలిసిన భీమనేని



పాలసముద్రం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను అమరావతిలో టీడీపీ కార్యనిర్వాహక రాష్ట్ర కార్యదర్శి భీమనేని చిట్టిబాబునాయుడి సోమవారం కలిశారు. ఈ సందర్భంగా జిల్లాతోపాటు గంగాధరనెల్లూరు, రాజంపేట నియోజకవర్గాల్లో టీడీపీ పరిస్థితిపై ప్రత్యేకంగా చర్చించారు. కాగా, భీమనేని జిల్లా పార్టీ అధ్యక్ష పదవి ఆశిస్తున్న సమయంలో అధిష్టానం పిలుపుతోనే లోకేశ్‌ను కలిశారని తెలియడంతో మండల నాయకులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

గరిమెళ్ల రచనలు స్ఫూర్తిదాయకం

చిత్తూరు సెంట్రల్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): దేశం కోసం పోరాడిన మహనీయుడు గరిమెళ్ల సత్యనారాయణ రచనలు స్ఫూర్తిదాయకమని పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జీవనజ్యోతి అన్నారు. గరిమెళ్ల జయంతి సందర్భంగా సోమవారం కళాశాలలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి, నివాళి అర్పించారు.

ప్రేమవాహిని రథయాత్ర



కళాకారులతో ఎమ్మెల్యే జగన్మోహన్

చిత్తూరు కల్చరల్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): సత్యసాయిబాబా శతజయంత్యుత్సవాల్లో భాగంగా సోమవారం సత్యసాయి ప్రేమవాహిని ప్రచార రథం చిత్తూరుకు చేరుకుంది. రథానికి ఎమ్మెల్యే జగన్మోహన్ తన కుటుంబ సభ్యులతో స్వాగతం పలికి, పూజలు చేశారు. మేయర్ అముద, చుడా చైర్‌పర్సన్ కటారి మేమలత, బాబు, ఎస్.మధుసూదనం, ప్రభాకర్ నాయుడు, పాండురంగం, శేషనారాయణ, శ్రీకంఠయ్య, సత్యనారాయణ, భక్తులు పాల్గొన్నారు.

82 వితంతు పింఛన్ల మంజూరు

గుడిపాల, జూలై 14 (ఆంధ్రజ్యోతి): మండలంలో 27 పంచాయతీల్లో భర్త కోల్పోయినవారికి 82 వితంతు పింఛన్లు మంజూరైనట్లు ఎంపీడీవో శిరీష ఓ ప్రకటనలో తెలిపారు. వీటిని సర్వేచేసి పింఛన్లు అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు.

మొక్కలు నాటి.. కాపాడాలి

వెదురుకుప్పం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి.. కాపాడాలని తిరుమలయ్యపల్లె జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం కె.చాముండేశ్వరి పిలుపునిచ్చారు. సోమవారం పాఠశాల ఆవరణంలో మొక్కలు నాటి, నీరు పోశారు. మాజీ సర్పంచ్ మొగిలయ్య, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

టీడీపీ నేతకు సన్మానం

పూతలపట్టు, జూలై 14 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు పార్లమెంటు టీడీపీ అధికార ప్రతినిధి గంగారపు గోపిని వజ్జిరెడ్డిపల్లె యువత సోమవారం సన్మానించింది. గ్రామంలో నిర్వహించే చెక్కల భజన కార్యక్రమానికి రావాలంటూ లక్ష్మయ్యవూరుకెళ్లి ఆహ్వానించారు. టీడీపీ నేత నరసింహులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు

చిత్తూరు అర్బన్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు నగరపాలక కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం జరిగింది. బాధితుల నుంచి ఎంఈ వెంకట్రామిరెడ్డి, ఇతర అధికారులు వినతులను స్వీకరించారు. సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టారు. ఇంజనీరింగ్‌కు 5, రెవెన్యూకు 4, పింఛన్‌కు 2 చొప్పున మొత్తం 11 అర్జీలు అందాయి. ఏసీపీ నాగేంద్ర పాల్గొన్నారు.

పెనుమూరు: ప్రజా సమస్యల సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు వచ్చే అర్జీలను సత్వరమే పరిష్కరించాలని తహసీల్దారు శ్రావణ్‌కుమార్ ఆదేశించారు. సోమవారం తన కార్యాలయంలో వీఆర్వోలు, సర్వేయర్లతో సమీక్షించారు.